వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492



www.prajaswecha.com

# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక





హైదరాబాద్ | సంచిక : 1 | సంపుటి : 139 | ఎడిటర్ : తరిగొప్పుల లక్ష్మి మహేందర్ ప్రజాపతి | నవంబర్ 2024 | వెల : రూ 10/-


## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



- తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

హైదరాబాద్,
నైరుతి బంగాళాఖాతంలో ఈ నెల 6, 7వ తేదీల్లో మరో అల్పపీడనం ఏర్పడబోతున్నట్టు భారత వాతావరణ శాఖ తెలిపింది. ఈ ప్రభావంతో తమిళనాడు, తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశముందని వెల్లడించింది. 6వ తేదీ తర్వాత ఉష్ణోగ్రతలు తగ్గుతాయని అంచనా వేసింది. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. అక్టోబర్‌లో

-మిగతా 2 లో

## బీసీ కులగణనకు డెడికేషన్ కమిషన్

- ఏర్పాటుకు సీఎం ఆదేశం



హైదరాబాద్,
తెలంగాణ బీసీ కులగణనకు డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర హైకోర్టు తీర్పునకు అనుగుణంగా డెడికేషన్ కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. సోమవారంలోగా డెడికేషన్ కమిషన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. బీసీ కులగణనపై ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని సీఎం స్పష్టం చేశారు.

-మిగతా 2 లో



# సీఎం రేవంత్‌కు హై టెన్షన్

## ముఖ్యమంత్రిపై పెరిగిన పని ఒత్తిడి

- కీలక శాఖలన్నీ ఆయన వద్దే
- క్యాబినెట్ విస్తరణను అడ్డుకుంటున్నదెవరు?
- పది నెలలుగా ఊరిస్తున్న అధిష్టానం
- పార్టీలో పెరుగుతున్న పోటీ
- ఆశావహుల్లో ఉత్కంఠ



హైదరాబాద్
ప్రజాపాలనను సమర్థవంతంగా ప్రజలకు అందించే క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్రమైన పని ఒత్తిడి పెరుగుతున్నది. కీలక

-మిగతా 2 లో




## రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం

- రెడ్డి సామాజిక తరగతి నుంచి రేవంత్‌రెడ్డే చివరి సీఎం
- రాష్ట్రవ్యాప్తంగా బీసీల సమర శంఖారావం
- మిర్యాలగూడ బీసీ గర్జనలో తీన్మార్ మల్లన్న

మిర్యాలగూడ
బీసీలంతా ఐక్యమయ్యే రోజులు వచ్చాయని, త్వరలోనే తెలంగాణలో బీసీ రాజ్యం రాబోతుందని, రాష్ట్రానికి రెడ్డి సామాజిక తరగతి నుంచి రేవంత్‌రెడ్డే చివరి ముఖ్యమంత్రి అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. ఆదివారం

-మిగతా 2 లో



## ప్రధాని పదవి గౌరవాన్ని దిగజారుస్తున్నారు

- మోడీపై మండిపడిన ప్రియాంక
- కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్యారంటీలు అమలు చేశాయి
- కేంద్రమే అనేక హామీలను విస్మరించింది

న్యూఢిల్లీ
ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ నాయకురాలు ప్రియాంక గాంధీ మండిపడ్డారు. ఆయన 140 కోట్ల మంది దేశ ప్రజలకు నిరంతరం కల్లబొల్లి హామీలు ఇస్తూ ప్రధాని పదవికి



## ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం


- ఎప్పుడు అనేది సైన్యం నిర్ణయిస్తుంది :ఇరాన్
- అదే జరిగితే ఇజ్రాయిల్‌ను ఆపలేం: అమెరికా

టెహ్రాన్
ఇజ్రాయిల్ ఇటీవల తమ దేశంపై జరిపిన దాడికి బుద్ధి చెప్పేందుకు ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి పథక రచన చేసింది. అయితే ఎదురు దాడి ఎప్పుడు చేపట్టేది మిలిటరీ ఉన్నతాధికారులు నిర్ణయిస్తారని ఇరాన్ రివల్యూషన్ గార్డు కార్ప్స్ (ఐఆర్‌జిసి) మాజీ కమాండర్ , రక్షణ, భద్రత వ్యవహారాల పార్లమెంటరీ కమిటీ సభ్యుడు

-మిగతా 2 లో

## విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడాలి

- అందుకే ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో వసతులు కల్పిస్తాం
- బడుగు, బలహీన వర్గాల కోసమే.. కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం
- 20 నెలల్లో ఎస్ఎల్బీసీ సొరంగం ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



హైదరాబాద్
ప్రపంచస్థాయిలో విద్యార్థులు పోటీపడేలా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లలో వసతులు కల్పిస్తామని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గడ్డిపల్లి గ్రామంలో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ఆదివారం

-మిగతా 2 లో



## రైతుల ఉసురుపోసుకుంటున్న సీఎం

వడ్లు కొనేదెప్పుడు?
కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి నెలరోజులు
మాజీమంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు

నంగునూరు
కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆయన

-మిగతా 2 లో

## పది రోజుల్లో రాజీనామా చేయాలి

- లేని పక్షంలో యూపీ సీఎంను చంపేస్తాం
- ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం



ముంబయి:
యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌ను హత్య చేస్తామంటూ ముంబయి పోలీసులకు బెదిరింపు సందేశం వచ్చింది. "బాబా సిద్ధిఖీలాగా యూపీ సీఎంను చంపుతాం" అంటూ దుండుగులు హెచ్చరించారు. ఆయన పది రోజుల్లో

-మిగతా 2 లో

www.prajaswecha.com ప్రజా స్వేచ్ఛ PRAJA SWECHA

# సీఎం రేవంత్ కు హై టెన్షన్

(మొదటి తరువాయి)

శాఖలన్నీ ఆయన వద్దే ఉండటంతో వాటిపై సమీక్షలు నిర్వహించాల్సి వస్తున్నది. అంతే కాకుండా ఏ మంత్రికి కేటాయించని ముఖ్యమైన శాఖలు కూడా సీఎం దగ్గరే ఉన్నాయి. ప్రజాబాహుళ్యానికి అత్యంత కీలకమైన శాఖలను రేవంత్ పర్యవేక్షించాల్సి వస్తున్నది. ముఖ్యంగా హెూం, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, శాంతిభద్రతలు, ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, విద్యాశాఖ, కార్మిక శాఖతోపాటు మంత్రులకు కేటాయించని శాఖలన్నింటినీ ముఖ్యమంత్రి సమన్వయం చేయాల్సి వస్తున్నది. దీంతో పాలన నిర్వహణ, సమీక్షలకు ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తున్నది. సంక్షేమ పథకాలకు రూపకల్పన చేయడం, వాటిని ప్రణాళికాబద్ధంగా అమలు చేయటం, అభివృద్ధి పనులను వేగవంతం చేయటంపై ఇది ప్రభావం చూపిస్తున్నది. ఎన్నికల హామీ మేరకు ఆయా శాఖల్లో అనేక మార్పులు, సంస్కరణలు తీసుకురావాల్సి ఉన్నది. కానీ ఆ మార్పులు ఇంకా మొదలు కావడం లేదు. రోజువారీగా పాలనా నిర్వహణ తప్ప ఆయా శాఖల్లో కొత్త కొత్త పథకాలను అమలు చేయడం లేదనే చెప్పొచ్చు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చడంతో ఆర్థిక నిర్వహణ కూడా పెద్ద సవాల్‌గా మారుతున్నది. ఇప్పటికే రైతు భరోసా ఆలస్యం కావడంతో అన్నదాతల ముఖాల్లో చిరునవ్వులు కనిపించడం లేదు. ఇచ్చిన హామీలను అమలు చేసే క్రమం నత్తనడకన సాగుతోన్నది. వీటిన్నింటిపై ముఖ్యమంత్రి దృష్టి సారించాలంటే మంత్రి వర్గ విస్తరణ చేపట్టాలని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

**పది నెలలైనా కార్యరూపమేది?**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలైంది. అప్పటి నుంచి ఇప్పటివరకు మీడియాలో మంత్రివర్గ విస్తరణపై పుంఖానుపుంఖాలుగా కథనాలు వస్తున్నాయి. కానీ అది కార్యరూపం దాల్చడం లేదు. ముఖ్యమంత్రి ఎప్పుడు ఢిల్లీకి వెళ్లినా అదిగో మంత్రివర్గ విస్తరణ, ఇదిగో మంత్రివర్గ విస్తరణ అంటూ బ్రేకింగులు, స్క్రోలింగ్‌లు వస్తున్నాయి. అవన్నీ మీడియాలో చూసి



ఆశావహులు కూడా ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో క్యాబినెట్ విస్తరణపై చర్చ పాత చింతకాయ పచ్చడిలా తయారైందని రాజకీయ వ్యాఖ్యాతలు సెటైర్లు వేస్తున్నారు. మంత్రులను నియమించడంలో ముఖ్యమంత్రికి విచక్షణాధికారాలు ఉన్నప్పటికీ ఇందులో పార్టీ అధిష్టానం కీ రోల్‌గా మారింది.

ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు సహచర మంత్రులు, పీసీసీ అధ్యక్షుడి అభిప్రాయాలు కూడా తీసుకోవాల్సి ఉంది. మన అసెంబ్లీలో సంఖ్యాబలం ఆధారంగా శాసనసభ్యుల్లో 15 శాతం మంత్రులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. దీని ప్రకారం సీఎంతోసహా 18 మంది మంత్రులు ఉండాలి. కానీ ప్రస్తుతం 12 మంది మంత్రులు మాత్రమే ఉన్నారు. మరో ఆరుగురికి మంత్రివర్గంలో అవకాశం ఉన్నది. పది ఉమ్మడి జిల్లాల్లో ఆరు జిల్లాలకు ప్రాతినిధ్యం ఉండగా, ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలకు బెర్తులు దక్కలేదు. ఆయా జిల్లాలకు క్యాబినెట్‌లో స్థానం కల్పిస్తేగానీ సీఎంపై పని ఒత్తిడి తగ్గే అవకాశం లేదు. తలా ఓ శాఖను అప్పగించడం ద్వారా ఆయన తనపై పడే భారాన్ని తగ్గించుకోవచ్చు. తద్వారా ప్రజాపాలనను ప్రజల దగ్గరికి చేర్చేందుకు మార్గం సుగమమవుతుందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

**బ్రేకింగులు, స్క్రోలింగులే**

మంత్రిపదవి కోసం పార్టీ నేతల్లో పోటీ కూడా విపరీతంగా ఉన్నది. దీంతోపాటు సామాజిక సమీకరణాలు కూడా పార్టీకి సవాల్‌గా నిలుస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కులగణన చేపట్టనున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీలతోపాటు బీసీల్లో కొన్ని (ముదిరాజ్, యాదవ, రజక) కులాల నుంచి పెద్ద ఎత్తున డిమాండ్లు వస్తున్నాయి. మంత్రులు కూడా ఫలాన వారికి అవకాశం ఇవ్వాలంటూ పట్టు పడుతున్నట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ కంటే ముందు కార్పొరేషన్ల చైర్మెన్లు, సభ్యులను నియమించడం ద్వారా మంత్రులను సీఎం కొంతమేరకు సంతృప్తిపరిచారు. మరికొంత మందికి చైర్మెన్ పదవులపై కసరత్తు జరుగుతున్నది. కానీ క్యాబినెట్ విస్తరణకు మాత్రం బ్రేకులు పడుతున్నాయి. ఏఐసీసీ స్థాయిలో కసరత్తు చేస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలమైన వారికే క్యాబినెట్‌లో చోటు కల్పించాల్సి ఉంటుంది. అలా జరిగినప్పుడే ఇబ్బందులు లేకుండా పాలన కొనసాగుతుంది. అయితే మంత్రివర్గంలో చోటు కోసం పోటీ పడుతున్న ఎమ్మెల్యేల సంఖ్య చాంతాడంత ఉంది. అందులో ప్రధానంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమసాగర్ రావు, మక్తల్ ఎమ్మెల్యే వాకటి శ్రీహరి ముదిరాజ్, ఎమ్మెల్సీ అమీర్ అలీ ఖాన్, దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి, డోర్నకల్ ఎమ్మెల్యే రామచందర్ నాయక్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మధన్ మోహన్‌రావులు మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్న వారిలో ముఖ్యులుగా ఉన్నారు. ఇప్పటికే వారు ఢిల్లీ పెద్దలతో మంతనాలు కూడా చేస్తున్నారు. పార్టీ పరంగా సీఎంపై ఒత్తిడి పెరుగుతుండడంతో వారిలో ఎవరికి పదవి ఇవ్వాలి, ఎవరిని పక్కన పెట్టాలన్న దానిపై రేవంత్ నిర్ణయం తీసుకోలేని పరిస్థితులు నెలకొన్నట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. సామాజిక సమీకరణాల విషయంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతోనే మంత్రి వర్గ విస్తరణ ఆలస్యం అవుతున్నట్లు ఆయా వర్గాలు భావిస్తున్నాయి.

# విద్యార్థులు ప్రపంచస్థాయిలో పోటీపడాలి

(మొదటి తరువాయి)

మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి ఆయన భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి మాట్లాడారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి కోసమే కోరి కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నామని గుర్తు చేశారు. 7.50 లక్షల మంది నిరుపేద విద్యార్థులు చదువుకునే సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మెస్, కాస్మోటిక్స్ చార్జీలు ఒక్కసారిగా 40 శాతం పెంచుతూ దీపావళి పండుగ రోజు ఆదేశాలు విడుదల చేశామని తెలిపారు. పేద బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చయినా భరించేందుకు సిద్ధంగా ఉందన్నారు. నాలుగో తరగతి నుంచి 12వ తరగతి వరకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, జనరల్.. అన్ని వర్గాల విద్యార్థులందరూ ఒకే చోట చదువుకునేలా అద్భుతంగా నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఒకే ఏడాదిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కోసం రూ.5 వేల కోట్లు కేటాయించామన్నారు. యాదాద్రి పవర్ ప్లాంట్ పనులు.. ఎక్కడివక్కడే నిలిచి పోయాయని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పర్యావరణ అనుమతులు సాధించామని తెలిపారు. ఏడాదిలో మూడు సార్లు పర్యటించి రెండు యూనిట్లు సింక్రనైజ్ చేసినట్టు చెప్పారు. 20 నెలల్లో ఎస్‌ఎల్‌బీసీ సొరంగం ప్రాజెక్టు పనులను పూర్తి చేయిస్తామని, నల్లగొండ జిల్లాను సస్యశ్యామలం చేస్తామని అన్నారు. మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలిసి తాను ఎస్‌ఎల్‌బీసీ దగ్గర సమీక్ష చేసిన విషయాన్ని గుర్తు చేశారు. మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. సంక్రాంతి తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందజేస్తామన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా రూ.10 లక్షల ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తున్నామని, రూ.18 వేల కోట్లతో రుణమాఫీ చేశామని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చెరువులు, చెట్లు, గుట్టల మధ్య ఆహ్లాదకర వాతావరణంలో మంచి నాణ్యమైన విద్యను బోధించేందుకు గడ్డిపల్లి గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలను నిర్మించడం సంతోషంగా ఉంద న్నారు. ఈ పాఠశాలకు డబుల్ రోడ్డు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పి రాంబాబు, డీఆర్డీఏ పీడీ అప్పారావు, మండల ప్రత్యేక అధికారి శ్యాంసుందర్, తహసీల్దార్ బండ కవిత, ఎంపీ డీవో సరోజ, కాంగ్రెస్ మండల అధ్యక్షులు త్రిపుర అంజన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పెండెం శ్రీనివాస్‌గౌడ్, ఎల్-27 లిఫ్ట్ ఇరిగేషన్ చైర్మెన్ సుందరి నాగేశ్వరరావు, ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇజ్రాయిల్‌కు బుద్ధి చెబుతాం

(మొదటి తరువాయి)

ఇస్మాయిల్ కోశారి చెప్పారు. ప్రతి దాడి ఎలా ఉండాలి అనే దానికి సంబంధించిన అన్ని వివరాలు మిలిటరీ నాయకులకు ఇచ్చాం. ఈ దాడులు ఎప్పుడు చేపట్టాలనేది వారే నిర్ణయిస్తారని ఆయన అన్నారు. 'యూదు దురహంకార ఇజ్రాయిల్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలనే విషయంలో ఇరాన్ సుప్రీం జాతీయ భద్రతా మండలి ఏకాభిప్రాయంతో ఉంది. ఇజ్రాయిల్ తాజా దురాగతానికి జవాబివ్వడం మా చట్టబద్ధమైన హక్కు. మేము దీనిని తప్పక ఉపయోగించుకుంటాం' అని కోశారి చెప్పారు. ఇరాకీ భూ భాగం నుంచి ఇజ్రాయిల్ యుద్ధ విమానాలు గత శనివారం ఇరాన్‌లోని మిలిటరీ స్థావరాలపై జరిపిన దాడిలో నల్గురు ఇరాన్ సైనికులు చనిపోయారు. ఒక పౌరుడు కూడా గాయాలతో తరువాత చనిపోయాడు. హనియే ను ఏప్రిల్‌లో ఇజ్రాయిల్ దాడి చేసి చంపినప్పటి నుంచి ఈ రెండు దేశాల మధ్య దాడులు, ప్రతి దాడులు గొలుసుకట్టుగా జరుగుతున్నాయి.

**ఇరాన్ మళ్లీ దాడి చేస్తే ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టం :**

**అమెరికా బెదిరింపు**

ఇరాన్ గనుక మళ్లీ దాడి చేస్తే ఇజ్రాయిల్‌ను ఆపడం కష్టమని, ఇది యుద్ధ విస్తరణకు దారి తీస్తుందని అమెరికా బెదిరించింది. ఇరాన్ మరోసారి దాడికి ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు ఇజ్రాయిల్ గూఢచారి వర్గాలు సూచించిన నేపథ్యంలో అమెరికా ఈ బెదిరింపులకు దిగింది. అమెరికా అధ్యక్ష ఎన్నికలలోపే ఇరాన్ దాడి చేయవచ్చని ఇజ్రాయిల్ ఇంటెలిజెన్స్‌ను ఉటంకిస్తూ యాక్సియోస్ వార్తా సంస్థ తెలిపింది.

# పది రోజుల్లో రాజీనామా చేయాలి

(మొదటి తరువాయి)

ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. శనివారం సాయంత్రం పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఈ మెసేజ్ వచ్చినట్టు తెలుస్తోంది. గత నెలలో మహారాష్ట్ర ఎన్సీపీ పవార్ వర్గం నేత బాబా సిద్ధిఖీని లారెన్స్ బిష్ణోరు గ్యాంగ్ సభ్యులు కాల్చి చంపిన విషయం తెలిసిందే. బాలీవుడ్ స్టార్ సల్మాన్‌తో సన్నిహితంగా ఉన్నందుకే చంపామని నిందితులు చెప్పారు. ఆ తర్వాత నుంచి పలువురికి లారెన్స్ గ్యాంగ్ నుంచి బెదిరింపులు వచ్చాయి. సిద్ధిఖీ కుమారుడు జీశాన్ కూడా హిట్‌లిస్ట్‌లో ఉన్నట్టు వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇటీవలే అతడికి కూడా బెదిరింపు కాల్స్ వచ్చాయి.

**గంటల్లోనే నిందితురాలి అరెస్టు**

ఈ బెదిరింపులను తీవ్రంగా పరిగణించిన ముంబయి పోలీసులు దర్యాప్తు చేపట్టారు. 24 ఏండ్ల వయస్సు ఉన్న ఓ మహిళ ఫోన్ నుంచి ఈ మెసేజ్ వచ్చినట్టు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

## బంగాళాఖాతంలో మరో అల్పపీడనం

(మొదటి తరువాయి)

నమోదైన సగటు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఈ ఏడాది 1.23 డిగ్రీల మేర పెరిగినట్టు చెప్పింది. సాధారణ శీతాకాలం ప్రభావం కనిపించదని భారత వాతావరణ శాఖ స్పష్టం చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో లానినా అభివృద్ధి కాకపోవడం, బంగాళాఖాతంలో తుఫాన్లు, వాయుగుండాల ఏర్పాటుతో గాలుల ప్రవాహం నిలిచిపోవడం ఇందుకు కారణంగా ఐఎండీ పేర్కొంది.

## బీసీ కులగణనకు డెడికేషన్ కమిషన్

కులగణనపై ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని.. కోర్టు ఉత్తర్వుల మేరకు సోమవారంలోగా డెడికేషన్ కమిషన్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు

## రాజ్యాధికారమే లక్ష్యంగా ఉద్యమం

(మొదటి తరువాయి)

నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో బీసీ జేఏసీ కో కన్వీనర్ తమ్మడబోయిన అర్జున్ అధ్యక్షతన నిర్వహించిన బీసీ గర్జన భారీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 60 శాతం జనాభా ఉన్న బీసీలను 70 ఏండ్లుగా రాజకీయంగా అణగదొక్కుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ఉద్యోగాల్లో బీసీలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈడబ్ల్యూఎస్ కోటా తీసుకొచ్చి 29 జీవో ద్వారా ఉద్యోగాలను లాక్కుంటున్నారని చెప్పారు. బీసీలను అన్యాయం చేసే అగ్రకుల రాజకీయ నాయకులను సమాధి చేయడమే లక్ష్యంగా ఉద్యమం కొనసాగుతుందన్నారు. విద్యా ఉద్యోగం, రాజకీయ ప్రాధాన్యత బీసీలకు భిక్ష కాదని హక్కు అని తెలిపారు. నల్లగొండ జిల్లాలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అగ్రకుల నాయకున్ని గెలవనివ్వబోమని అన్నారు. మిర్యాలగూడలో 15 మంది ఎమ్మెల్యేలు అయ్యారని, కానీ ఇప్పటివరకు ఒక్కరు కూడా బీసీలు ఎమ్మెల్యే కాలేదని చెప్పారు. బీసీ బిడ్డలకు ఏ చిన్న అన్యాయం జరిగినా ఊరుకోబోమని, ఏ చిన్న సమస్య వచ్చినా తనను సంప్రదించాలని కోరారు. భవిష్యత్‌లో రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో బీసీల సభ నిర్వహిస్తామని చెప్పారు. నల్లగొండ, సూర్యాపేట, భువనగిరిలో బీసీల సమర శంఖం నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మెన్ నేతి విద్యాసాగర్, మాజీ ఎమ్మెల్సీలు పూల రవీందర్, ఆకుల లలిత, మాజీ ఎమ్మెల్యే పుట్టమధు, బీపీ మండల్ మనువడు సూరజ్ మండల్, రిటైర్డ్ కలెక్టర్ చిరంజీవులు, నాయకులు చెరుకు సుధాకర్, వట్టి జానయ్యయాదవ్, పిల్లి రామరాజుయాదవ్, తండు సైదులుగౌడ్, జనార్ధన్, వరంగల్ శ్రీనివాస్, కొల సైదులు, మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని పదవి గౌరవాన్ని దిగజారుస్తున్నారు

(మొదటి తరువాయి)

ఉన్న గౌరవాన్ని దిగజారుస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు ఆమె సామాజిక మాధ్యమం ఎక్స్‌లో శనివారం పోస్ట్ పెడుతూ కాంగ్రెస్‌పై దృష్టి సారించే బదులు తన పదవికి ఉన్న గౌరవాన్ని కాపాడడంపై శ్రద్ధ చూపాలని, అందుకోసం నిజాలే మాట్లాడాలని సూచించారు. కాంగ్రెస్ వాస్తవ దూరమైన హామీలు ఇస్తోందంటూ ప్రధాని మోడీ చేసిన విమర్శపై ఆమె స్పందిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'సత్యమే దైవము అని మహాత్మా గాంధీజీ చెప్పే వారు. మండూక ఉపనిషత్తులో సత్యమేవ జయతే అని రాశారు. అదే మన జాతీయ నినాదం. ఈ నినాదమే సత్యాన్ని చాటిచెప్పింది. భారత స్వాతంత్రోద్యమానికి, దేశ పునర్నిర్మాణానికి, ప్రజా జీవనానికి ఆదర్శంగా మారింది' అని ప్రియాంక తెలిపారు.ం

## రైతుల ఉసురుపోసుకుంటున్న సీఎం

(మొదటి తరువాయి)

సందర్శించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. కేసీఆర్ హయాంలో వడ్లు కల్లాలకు రాకముందే సంచులు పంపించి, మిల్లర్లతో టైయ్యప్ చేపించి, ట్రాన్స్‌పోర్టు ఏర్పాటు చేసి మరీ రైతుల నుంచి వడ్లు కొనుగోలు చేశారని గుర్తుచేశారు. కానీ రేవంత్ ప్రభుత్వం నెలరోజులైనా వడ్లు కొనుగోలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రాల ప్రారంభంతో రైతులు వడ్లు తీసుకొచ్చి ఎదురుచూస్తున్నా కొనకపోవడంతో అకాల వర్షాలతో తడిసి ముద్దవుతున్నాయని, కోతులు, పందికొక్కులకు ఆహారం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల, మహబూబాబాద్, సూర్యాపేట, రాజన్న సిరిసిల్ల తదితర జిల్లాల్లో రైతులంతా రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారన్నారు. సీఎం రైతులను రోడ్డుపై పడేశారన్నారు. ఓట్లప్పుడు ఊరురా తిరిగిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు ఎందుకు రైతుల దగ్గరికి వెళ్లట్లేదని ప్రశ్నించారు. సీఎం గానీ, మంత్రులు గానీ ఏ ఒక్కరూ రైతుల కష్టాలు పట్టించుకోవట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ రెండు సార్లు రైతుబంధు ఇస్తే.. మూడుసార్లు ఇవ్వాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారని, ఇప్పుడు ఒక్కసారి కూడా రైతుబంధు ఇవ్వలేదన్నారు. రూ.7,521కు కొనుగోలు చేయాల్సిన పత్తి.. కేవలం రూ.5000కు రైతులు అమ్ముకుంటు న్నారన్నారు. పత్తికి మద్దతు ధర లేదని, మక్కల కొనుగోలు కేంద్రాలు లేవని, వడ్లు రూ 1800కే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాలో సోయాబీన్ కొనుగోలు చేసిన ప్రభుత్వం రెండు నెలలైనా డబ్బులు ఇవ్వలేదని చెప్పారు. దాంతో చాలా మంది రైతులు దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. సిద్దిపేట జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో వానాకాలం వరి సాగు అయ్యిందని 9 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు పండుతాయని, కానీ ఇప్పటి వరకు అధికారులు వెయ్యి మెట్రిక్ టన్నుల వడ్లు కూడా కొనలేదన్నారు. రైతుల పంటలకు మద్దతు ధర ఇవ్వాలని, రూ.500 బోనస్ ఇవ్వాలని, లేకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నాలు చేపట్టి ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మెన్లు ఎడ్ల సోమిరెడ్డి, రాగుల సారయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు ఆనగోని లింగం గౌడ్, సొసైటీ చైర్మెన్లు కోల రమేశ్ గౌడ్, ఎల్లంకి మహిపాల్ రెడ్డి మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

# అమెరికా అధ్యక్ష ఎన్నికలు-విజేత ఎవరో!

అమెరికా అరవయ్యవ అధ్యక్ష ఎన్నికల్లో 47వ అధ్యక్షుడిని ఎన్నుకోవటానికి నవంబర్ ఐదవ తేదీన ఎన్నికలు జరగబోతున్నాయి. అమెరికాలో ఉన్న వెసులుబాటు దృష్ట్యా ఇప్పటికే పోలింగ్ కేంద్రాలు, మెయిల్ ద్వారా దాదాపు 5.3 కోట్ల మందికి పైగా ఓటు వేశారు. పదిహేడేళ్ల కిందట ప్రారంభమైన ఆర్థిక మాంద్యం నుంచి అమెరికా ఇప్పటికీ కోలుకోలేదు. నిరుద్యోగం పెరిగిపోయింది. ఈ పరిస్థితులలో ప్రస్తుత ఎన్నికలు జరుగుతున్నాయి. ప్రధాన పార్టీలైన రిపబ్లికన్ పార్టీ తరపున మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తిరిగి పోటీ చేస్తుండగా, డెమొక్రటిక్ పార్టీ తరపున ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ తలపడుతున్నారు. వచ్చే వారంలో విజేత ఎవరో ప్రజలు తేలుస్తారు.

**-అమెరికాలో అధ్యక్ష పాలనా విధానం**

అమెరికా రాజ్యాంగం దేశంలో అధ్యక్ష పాలనా విధానం ప్రవేశ పెట్టింది. జాతీయ స్థాయిలో అధ్యక్షుడు, రాష్ట్ర స్థాయిలో గవర్నర్ నిజమైన అధికారాలు కలిగి ఉంటారు. అధ్యక్షుని పదవీ కాలం 4 సంవత్సరాలు. ప్రతి లీపు సంవత్సరంలో నవంబర్ మొదటి సోమవారం తర్వాత వచ్చే మంగళవారం నాడు ఎన్నిక జరుగుతుంది. ఎన్నికైన అభ్యర్థి మరుసటి సంవత్సరం జనవరి 20న ప్రమాణ స్వీకారం చేస్తారు. అధ్యక్షుడిగా పోటీ చేయటానికి 35 ఏళ్ల వయసు కలిగి, అమెరికాలో జన్మించిన అమెరికా పౌరుడై, కనీసం 14 ఏళ్ల పాటు అమెరికాలో నివశించి వుండాలి. 1850 నుండి అమెరికాలో డెమొక్రటిక్ పార్టీ, రిపబ్లికన్ పార్టీల ఆధిపత్యం కొనసాగుతున్నది. లిబర్టేరియన్ పార్టీ, కమ్యూనిస్ట్ పార్టీ, గ్రీన్స్ పార్టీ, కాన్‌స్టిట్యూషన్ పార్టీ తదితర పార్టీలు ఉన్నప్పటికి వాటి ప్రాబల్యం నామమాత్రమే. గత 180 ఏళ్లుగా ఈ రెండు పార్టీల అభ్యర్థులే అధ్యక్షులుగా గెలుపొందుతున్నారు. డెమొక్రటిక్ పార్టీ చిహ్నం గాడిద కాగా, రిపబ్లికన్ పార్టీ చిహ్నం ఏనుగు. అధ్యక్షుడితోపాటు ఉపాధ్యక్షుడు కూడా ఎన్నికవుతారు. ఏ కారణం వల్లనైనా అధ్యక్ష పదవి ఖాళీ అయితే మిగిలిన కాలం ఉపాధ్యక్షులే అధ్యక్షులుగా కొనసాగుతారు.

**పార్టీల అభ్యర్థుల ఎన్నిక**

అమెరికా అధ్యక్ష ఎన్నికలలో రెండు పార్టీల అభ్యర్థుల ఎన్నిక ప్రక్రియ నవంబర్ నెలకి 8 నెలలు ముందే ప్రారంభం అవుతుంది. రిపబ్లికన్ లేదా డెమొక్రటిక్ పార్టీల తరపున అధ్యక్ష పదవికి పోటీ చేయాలనే అభిలాష, ఆలోచన అనేక మందికి ఉండవచ్చు. కాని చివరకు ఒక్కొక్క పార్టీ తరపున ఒక్కరే రంగంలో ఉండాలి. అభ్యర్థి ఎన్నిక ప్రక్రియ దాదాపు 6 నుండి 8 నెలల పాటు కొనసాగుతుంది. ఈసారి డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థిత్వానికి బైడెన్ తిరిగి పోటీ చేయడానికే నిర్ణయించుకున్నప్పటికీ వయసు మీద పడడంతో మతిమరుపు, తూలడం వంటి సమస్యల వల్ల సొంత పార్టీ నుంచే తప్పుకోమని డిమాండ్ వచ్చింది. దీంతో ఆయన తప్పుకుని ఉపాధ్యక్షురాలు హారిస్‌ను డెమొక్రటిక్ అభ్యర్థిగా ప్రకటించారు. హారిస్ డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకోడానికి 1976 డెలిగేట్ల మద్దతు అవసరం కాగా, ఆమెకు కాకసస్, ప్రైమరీస్‌లో 4,567 మంది డెలిగేట్ల మద్దతు లభించింది. అలాగే రిపబ్లికన్ పార్టీ అభ్యర్థిత్వం చేజిక్కించుకోడానికి ట్రంప్‌కు 1215 మంది డెలిగేట్ల మద్దతు అవసరం కాగా, 2,243 మంది డెలిగేట్ల మద్దతు లభించింది. తొలుత ఒక రాష్ట్రంలో ఒక జిల్లాకు లేదా ఒక ప్రాంతానికి సంబంధించిన ఒక పార్టీ నాయకులు తమ పార్టీ తరపున ఏ అభ్యర్థిని బలపరుచుదామనే విషయాన్ని చర్చించటానికి ఏర్పాటు చేసుకునే సమావేశాన్ని "కాకసస్" అంటారు. కొన్ని కాకసస్‌లు కలిసి 'కౌంటీ'గాను, కొన్ని కౌంటీలు కలసి స్టేట్ గ్రూప్ గాను ఏర్పడతాయి. రెండో దశలో పోటీ చేయాలనుకుంటున్న అభ్యర్థి పార్టీకి చెందిన రిజిస్టర్ ఓటర్లు పాల్గొనే సమావేశాన్ని "ప్రైమరీలు" అంటారు. ఈ సమావేశాలలో ఒక పార్టీ తరపున పోటీ చేస్తున్న అభ్యర్థులు తమ ఆర్థిక, సామాజిక, విదేశాంగ విధానాలు, ఇతర అంశాలు వివరిస్తారు. రహస్య ఓటింగ్ జరుగుతుంది. ప్రైమరీలలో తమకు వచ్చే ఓట్లను బట్టి అభ్యర్థులు పోటీలో కొనసాగడమో, విరమించుకోవడమో చేస్తారు. మూడవ దశలో ఆ పార్టీ జాతీయ సదస్సు జరిగి ఎక్కువ మంది డెలిగేట్ల మద్దతు పొందిన వారికి పార్టీ అభ్యర్థిగా నామినేట్ చేస్తారు.

**అమెరికన్ కాంగ్రెస్ - నిర్మాణం**

అమెరికాలో పార్లమెంట్‌ను కాంగ్రెస్ అంటారు. దీనిలో ఎగువసభ పేరు సెనేట్. ఆ సభలో 100 మంది సభ్యులు వుంటారు. 50 రాష్ట్రాల నుండి సమానంగా రాష్ట్రానికి ఇద్దరు చొప్పున సెనేట్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు.

వీరి పదవీ కాలం 6 సంవత్సరాలు. ప్రతి రెండేళ్లకు 1/3 వంతు చొప్పున పదవీ విరమణ చేసి ఎన్నికలు జరుగుతాయి. దిగువసభ పేరు ప్రతినిధుల సభ (హౌస్ ఆఫ్ రిప్రజెంటేటివ్స్). దీనిలో 438 మంది సభ్యులుంటారు. వీరి ఎన్నిక అధ్యక్ష ఎన్నికలతో పాటే జరుగుతాయి. 50 రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాల జనాభాను బట్టి ప్రతినిధుల సభలో ప్రాతినిధ్యం వుంటుంది. ఉదాహరణకు పెద్ద రాష్ట్రమైన కాలిఫోర్నియా నుండి ప్రతినిధుల సభలో 52 మంది ఉండగా టెక్సాస్ నుండి 36 మంది, చిన్న రాష్ట్రాలైన వెర్మాంట్, నెవడా, నార్త్ డకోటాల నుండి ఒక స్థానం మాత్రమే ఉన్నది.

**అధ్యక్ష ఎన్నిక -ఎలక్టొరల్ కాలేజి పాత్ర**

ప్రపంచంలో అధ్యక్ష పాలనా విధానం అనేక దేశాలలో ఉన్నది. ఆయా దేశాల అధ్యక్షులు ఎన్నికలలో ప్రజలు వేసిన "పాపులర్ ఓటు" ఆధారంగా గెలుపొందుతారు. అనగా మెజారిటీ ఓట్లు పొందినవారు గెలుస్తారు. కాని అమెరికా అధ్యక్ష ఎన్నిక భిన్నంగాను, సంక్లిష్టంగాను ఉంటుంది. అధ్యక్షుడిని ఎన్నుకోవటానికి ఒక "ఎలక్టొరల్ కాలేజి" ఏర్పడుతుంది. ఈ కాలేజీలో 538 మంది ఎలక్టొరేట్లు ఉంటారు. ఒక్కో రాష్ట్రం నుండి కాంగ్రెస్‌లో సభ్యుల సంఖ్యకు సరిపడా ఎలక్టొరల్ కాలేజీలో ప్రాతినిధ్యం వుంటుంది. ఉదాహరణకు కాలిఫోర్నియా రాష్ట్రానికి ప్రతినిధుల సభలో 52, సెనేట్‌లో 2, మొత్తం 54 మంది సభ్యులుంటారు. ఆ రాష్ట్రానికి ఎలక్టొరల్ కాలేజీలో 54 మంది ఉంటారు. నార్త్ కరోలినా రాష్ట్రానికి ప్రతినిధుల సభలో 12 మంది, సెనేట్‌లో 2, మొత్తం 14 మంది ఉంటే, ఎలక్టొరల్ కాలేజీలో 14 మంది ప్రాతినిధ్యం పొందుతారు. అధ్యక్ష పదవికి ఎన్నికలు జరిగిన తరువాత ఏ రాష్ట్రంలోనైనా పాపులర్ ఓటు ఏ అభ్యర్థికి ఎక్కువగా వస్తే, ఆ రాష్ట్రంలోని ఎలక్టొరల్ ఓట్లన్నీ అతనికే చెందుతాయి.

# మోహన్ భగవత్ టు మోడీ -అదే దాడి!




తనకు తానే తుమ్మి చిరంజీవ అనుకున్నారని సామెత. ప్రధాని నరేంద్ర మోడీ, ఆయన ఎన్డీయే కూటమి పరిస్థితి అలాగే వుంటుంది. తమ హయాంలో జరిగిన ప్రగతికి ప్రపంచం దిగ్భ్రాంతి చెందుతోందని, ప్రపంచం భారత దేశం వంక చూస్తున్నదని అహోరాత్రులు చెబుతూనే వుంటారు. ఇందుకు ఆధారాలు చూపుతారా అంటే అదీ వుండదు. అంతర్జాతీయ మీడియాలో విమర్శలు వస్తే వెంటనే కట్ట కట్టుకుని దాడి చేస్తారు. సోషల్ మీడియాలో మొదలై కేంద్ర మంత్రుల దాకా ఆ పవిత్ర ఖండనలో పాలు పంచుకుంటారు. ఈ ప్రహసనం పదేళ్లుగా సాగుతూనే వుంది. తాజాగా అక్టోబరు 31వ తేదీన ప్రధాని మోడీ సర్దార్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ సమైక్యతా దినోత్సవం తతంగంలో ఇదే చేశారు. సర్దార్ పటేల్ విగ్రహం దగ్గర ప్రసంగిస్తూ ఏకపక్ష వ్యాఖ్యానాలు గుప్పించారు. అసలు ఆ రోజును పటేల్‌తో ముడి పెట్టి ఈ ఉత్సవం జరపాలని నిర్ణయించడమే పెద్ద రాజకీయం. ఎందుకంటే దీర్ఘకాలం దేశాన్ని పాలించిన ప్రధాని ఇందిరా గాంధీ అధికార నివాసంలోనే కుట్రపూరితంగా హత్యకు గురైన రోజు అది. రాజకీయ విభేదాలు, ఎవరి తప్పొప్పులు ఎలా వున్నా దేశ చరిత్ర మారదు. అందులోనూ అత్యున్నత పదవిలో వున్న ప్రధాని హత్యకు గురైన ఘటన ఉద్వేగంతో ముడిపడి వుంది. అదే రోజున సిక్కులపై ఊచకోత కూడా జరిగింది. బిజెపి వ్యూహంలో ఈ రెండో అంశాన్నే చెబుతూ ప్రధాని ఇందిర హత్యను విస్మరించే విధానం మొదలుపెట్టారు. ఎక్కడో అమెరికాలో కెనడీ హత్య గురించి దశాబ్దాల తరబడి చెప్పే బడా మీడియా కూడా నాటి చరిత్రను పూర్తిగా వదిలేసింది. ఎందుకంటే ఏ ప్రముఖ పత్రికలోనూ ఛానల్‌లోనూ ఆమె గురించిన రాతలు లేవు. ఒక పెద్ద పత్రిక సిక్కులపై హత్యాకాండ గురించి మాత్రం రాసింది. మీడియా పాలకుల చెప్పుచేతల్లో ఎంతగా చిక్కుకుపోయింది దీన్నిబట్టే తెలుస్తుంది. సర్దార్ పటేల్ నామస్మరణతో నాటి అత్యున్నత నాయకుడు నెహ్రూను మరుగుపర్చడం మోడీ వ్యూహం. అయితే పార్టీలు ఏవైనా హత్యలకు గురైన కీలక నాయకులను కూడా విస్మరించడం మొదలు పెడితే చరిత్రకే అపచారం తప్పదు.

**370 రద్దు రాజ్యాంగ రక్షణా?**

వర్తమానానికి వస్తే మోడీ ఈ సందర్భంగా చేసిన వ్యాఖ్యలలో తలకిందులు తర్కం, రాజకీయ వ్యూహం దిగ్భ్రాంతి కలిగిస్తాయి. మొదటే చెప్పినట్టు దేశం అమోఘంగా పురోగమించిందని తనకు తనే కితాబులిచ్చుకోవడం ఒకటి. అంతకు మించింది రాజ్యాంగ రక్షకుడుగా తనను తాను చెప్పుకున్న తీరు. దేశంలో రాజ్యాంగ మూల సూత్రాలపై జరుగుతున్న దాడి గురించి దేశమంతా ఆందోళన చెందుతున్నది. మొన్నటి ఎన్నికల్లో ప్రజల తీర్పులోనూ ఆ విషయం ద్యోతకమైంది. 400 సీట్ల కోతల నుంచి సగానికి కొంచెం ఎక్కువగా మాత్రమే తెచ్చుకున్న మోడీ కూడా దీన్ని గుర్తించి రాజ్యాంగ పటానికి పూజలు ప్రారంభించారు కూడా. అంతకు ముందు రెండు సార్లు గెలిచినప్పుడు ఈ షో లేదే మరి? రాజ్యాంగ రక్షణ గురించి సుప్రీం కోర్టు న్యాయమూర్తులు కూడా పదే పదే ప్రస్తావించడం, విచారణలో వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఇవేవీ గమనించకుండా మోడీ రాజ్యాంగ గ్రంథం పట్టుకున్నారనుకుంటే పొరబాటే. కానీ మొన్నటి ప్రసంగంలో ఆయన తీసుకున్న వాదనే వింతగా వుంది. రాజ్యాంగం పేరుతో తమకు వ్యతిరేకంగా ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆయన ఆరోపణ! ఒకే దేశం ఒకే పన్ను, ఒకే కార్డు వంటి వాటిని ఏకరువు పెట్టిన తర్వాత ఒకే దేశం ఒకే రాజ్యాంగం వుండేలా తాము కీలక చర్యలు తీసుకున్నామని కొత్త పాట ఆలపించారు. కాశ్మీర్ 370వ అధికరణం రద్దుకు సమర్థన ఇది. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో కొన్ని రాష్ట్రాలకు ప్రత్యేక నిబంధనలు ఇవ్వడం వేరే రాజ్యాంగం అవుతుందా? ఇప్పటికీ అనేక రాష్ట్రాలకు కొన్ని విషయాల్లో ప్రత్యేక నిబంధనలు వున్నాయి. 370 అధికరణం రద్దు నిజానికి రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బ తీసిన చర్య. ఇటీవలి ఎన్నికలలో కాశ్మీర్ ప్రజలు ఆ చర్యను తిరస్కరించారు కూడా. అయినా అదే తమ విజయమైనట్టు, ఒకే రాజ్యాంగం అమలులోకి తెచ్చినట్టు చెప్పుకోవడం మోడీ గడుసుతనం తప్ప ఇసుమంత నిజం లేదు. రాజ్యాంగ మూల సూత్రాలైన లౌకికతత్వం, సమాఖ్యతత్వం, ప్రజాస్వామ్య భావప్రకటనా స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సార్వభౌత్వం కీలకమైనవి. ఇందులో ప్రతిదానిపైన పనిగట్టుకుని దాడి చేసిన, చేస్తున్న మోడీ అదేదో రాజ్యాంగ రక్షణగా చెప్పుకోవడం వింతల్లో వింత.

**కాశ్మీర్ పరిస్థితే అన్ని రాష్ట్రాలకీనా?**

మోడీకి గడుసుతనం ఎక్కువే కావొచ్చుగానీ ప్రజల తెలివిని మరీ తక్కువ అంచనా వేస్తే చెల్లుతుందా? ఉన్న ఒక రాజ్యాంగ స్ఫూర్తిని భగం చేసే మహత్కార్యంలో ఆయన 370 అధికరణం రద్దు తర్వాత దేశంలోని రాష్ట్రాలన్నిటికీ ఎసరు పెట్టడం యాదృచ్ఛికం కాదు. ఈ జాతీయ సమైక్యతా ప్రసంగంలోనే ఒకే దేశం ఒకే ఎన్నిక మంత్రోచ్చారణలో మర్మం అదే. మిగిలిన రాష్ట్రాలకూ అదే గతి పట్టిస్తానని ఆయన సందేశం సంకేతం కూడా. ఎందుకంటే రాజ్యాంగం రెండవ అధికరణం దేశాన్ని రాష్ట్రాల సమాఖ్య (యూనియన్ ఆఫ్ స్టేట్స్) అని నిర్వచిస్తున్నది. అమెరికాలో లాగా ఒకప్పటి సోవియట్ యూనియన్‌లో లాగా రాష్ట్రాలకు ప్రత్యేక రాజ్యాంగాలు లేకున్నా స్వయం ప్రతిపత్తి వుండాలని రాజ్యాంగం అభిలషించింది గనకే ఇలా స్పష్టంగా పేర్కొంది. కానీ 'ఒకే దేశం, ఒకే కార్డు, ఒకే పన్ను, ఒకే రేషన్, ఒకే మతం, ఒకే పార్టీ, ఒకే నేత ' ఇలా ఒన్ మానియా పట్టిన మోడీజీ ఒకే ఎన్నిక వుంటేనే ఒకే దేశం అంటున్నారు. ఇది అక్షరాలా ఆరెస్సెస్ తరహా కేంద్రీకృత పెత్తనాన్ని, కార్పొరేట్ తరహా ఒకే మార్కెట్ వ్యూ వ్యూహాన్ని కలగలపిన ఆరెస్సెస్ మాజీ ప్రచారక ప్రావీణ్యమే. పంజాబ సింధు గుజరాత మరాఠా ద్రావిడ ఉత్కళ వంగ..అంటూ రవీంద్రనాథ్ టాగూర్ పాడినప్పటికి దేశ స్వాతంత్ర్యం కనుచూపు మేరలో లేదు. రాష్ట్రాలూ ఈ విధంగా లేవు. దక్షిణాది రాష్ట్రాలూ భాషలన్నిటినీ కలిపి ద్రావిడ అన్నారు. సింధ్ ప్రాంతం ఇప్పుడు ఇండియా లోనే లేదు. అయినా ఈ దేశ చరిత్రను, స్వభావాన్ని ఆయన గానం చేశాడు గనక దాన్నే జాతీయ గీతంగా పాడుకుంటున్నాం. విభిన్న భాషా సంస్కృతుల సమ్మేళనమైన భారత దేశం వైవిధ్య వైభవానికి సంకేతంగా గౌరవించుకుంటున్నాం. అందులోంచి పుట్టిన స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తి దేశాన్ని ఒక్క తాటిపై నడిపింది.

# బెటాలియన్ వ్యవస్థను రద్దు చేయాలి!

కొత్తగా ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో ప్రజలందరి జీవితాలతో పాటుగా బెటాలియన్ కానిస్టేబుల్ కుటుంబాల బ్రతుకులు కూడా మారుతాయి అనే ఆకాంక్షతో ఎదురుచూసిన పోలీసు కానిస్టేబుల్ కుటుంబాల్లో నిరాశే మిగిలింది. గతంలో రాజకీయ పార్టీలు ఏక్ పోలీస్ వ్యవస్థ ఏర్పాటు విషయంలో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగస్థులకు ఇచ్చిన హామీలు నెరవేరలేదు. నాడు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పెరుగుతున్న వామపక్ష భావజాలాన్ని నియంత్రించేందుకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబు నాయుడు ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థను బలోపేతం చేస్తూ గ్రే హౌండ్స్ అనే కొత్త పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ, మలిదశ తెలంగాణ ఉద్యమం నేపథ్యంలో విప్లవ పార్టీలు కూడా తెలంగాణ రాష్ట్రానికై పోరాడాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తదనంతరం నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో కూడా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతూ, కొంతవరకు యువత ఆధునిక భావాల వైపు వెళ్తున్నారు. గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన కేసీఆర్, చంద్రబాబు నాయుడు కూడా నక్సలిజం ప్రభావం తగ్గిందని ప్రకటించారు. అంతేగాక, సీఆర్‌పీఎఫ్ లాంటి కేంద్ర బలగాలు జాతీయ స్థాయిలో దేశ రక్షణలో బాధ్యత వహిస్తుంటే తెలంగాణ రాష్ట్రంలో స్పెషల్ పోలీస్ ఇండియన్ రిజర్వ్ అనే పేరుతో తెలంగాణ రాష్ట్ర బెటాలియన్ పోలీసులను వివిధ రాష్ట్రాలలో పని చేయించడం కూడా సహేతుకం కాదు. దేశంలో శాటిలైట్, ఇంటర్నెట్, జీపీఎస్ సదుపాయాల ద్వారా నిఘా వ్యవస్థలు కూడా పటిష్టమవుతున్న నేపథ్యంలో తెలంగాణ బెటాలియన్ స్పెషల్ పోలీస్ వ్యవస్థ



ఆవశ్యకతా, మనుగడా నేడు ప్రశ్నార్థకంగా మారింది. ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థలో ఉన్న అంతర్గత అధికారిక ఒత్తిడి, వివక్షల కారణంగా ఎంతో మంది కానిస్టేబుల్ ఉద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. కానీ, ఇప్పటివరకు, ఆత్మహత్యలపై ఒక్క నిజనిర్ధారణ కమిటీ నియమించలేదు. ఒకే పోలీసు నియామక బోర్డు ద్వారా ఎంపికైన భిన్న విభాగ పోలీస్ వ్యవస్థలలో బెటాలియన్ వ్యవస్థకు సంబంధించిన పోలీసు ఉన్నతాధికారులు కంపెనీ మూమెంట్‌కు సంబంధించిన వ్యవహారాల్లో పోలీస్ స్టేషన్లను కేటాయించినప్పుడు సివిల్, ఏఆర్ లాంటి ఇతర పోలీసు విభాగాల నుంచి వివక్షలకు గురి కావడం ఒక రకమైన కుల వ్యవస్థని తలపిస్తుంది. ఎన్నో సంవత్సరాలుగా నష్టపోతున్న పోలీస్ కానిస్టేబుల్ కార్మిక కుటుంబాలు డిమాండ్ చేస్తున్న అంశం అయిన 'ఒకే రాష్ట్రం ఒకే పోలీస్ విధానం'ను ఇప్పటికైనా అమలుపరచాలి. ఒకే పనిపై వాళ్ళని నియమించి, ఎనిమిది గంటల పని విధానాన్ని కల్పించాలి. కానిస్టేబుల్స్‌ను వివక్షకు గురి చేయకుండా, అనైతిక బానిసత్వం నుంచి విముక్తి కలిగించి, వృత్తిపరంగా గౌరవప్రదమైన జీవితాన్ని కల్పించాలి. కుటుంబానికి దూరంగా ఉంచి, వారి పిల్లల భవిష్యత్తుకి ఆటంకం కలిగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. సమకాలీన సమాజంలో ప్రాధాన్యత లేని ఈ బెటాలియన్ పోలీస్ వ్యవస్థ నిర్వహణ కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారంగా మారుతున్న తరుణంలో తెలంగాణ రాష్ట్రంలో బెటాలియన్ స్పెషల్ పోలీస్ వ్యవస్థను రద్దు చేసి 'ఏక్ స్టేట్ -ఏక్ పోలీస్' విధానం తీసుకొని రావడం ద్వారా కానిస్టేబుల్స్ కుటుంబాల జీవితాల్లో గుణాత్మక మార్పులు సాధ్యం అవుతాయి.

# తెలంగాణలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే - ప్రారంభం అధికారుకులు అడిగే ప్రశ్నలు

ప్రజా స్వేచ్ఛ
1. పేరు 2. కుటుంబ పెద్దతో సంబంధం 3. లింగం (మూడో లింగం సహా) 4. మతం 5. కులం వర్గం (ఎస్సీ/ఎస్టీ/బీసీ/ఓసీ) 6. ఉపకులం 7. వయసు 8. మాతృభాష 9. ఆధార్ నంబర్ 10. ఓటర్ ఐడీ నంబర్ 11. వైకల్యం స్థితి 12. వివాహ స్థితి 13. పెళ్లి సమయంలో వయసు 14. పిల్లలు స్కూలు ప్రారంభించిన వయసు (ఆరేళ్ల లోపు అయితే 15. చదివిన పాఠశాల రక 16. విద్యా అర్హతలు 17. పాఠశాల విడిచి పెట్టిన సందర్భాలు (ఆరేళ్ల నుండి 16 ఏళ్ల మధ్య) 18. చదువు కొనసాగించకపోవడానికి కారణాలు (17 నుండి 40 ఏళ్ల మధ్య) 19. అక్షరాస్యత లేకపోవడానికి కారణాలు, ఉండే పక్షంలో 20. ఉద్యోగం స్వరూపం21. స్వయం ఉపాధి వివరాలు22. అసంఘటిత రంగంలో పని వివరాలు23. కులపరమైన వృత్తుల వివరాలు24. వార్షిక ఆదాయం25. బ్యాంక్ ఖాతా వివరాలు26. ఆదాయపు పన్ను స్థితి27. కుల వృత్తులకు సంబంధించి ఆరోగ్య సమస్యలు 28. విద్యలో రిజర్వేషన్ ప్రయోజనాల ప్రాప్తి 29. ఉద్యోగంలో రిజర్వేషన్ ప్రయోజనాల ప్రాప్తి 30. ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ఈబీసీల కుల ధృవపత్రాలు కలిగి ఉండడం 31. రాజకీయ నేపథ్యం వివరాలు 32. ప్రస్తుతం ఉన్న పదవులు 33. పదవీకాలం సంఖ్య 34. ప్రజా ప్రతినిధిగా సేవ చేసిన సంవత్సరాలు 35. నామినేట్ చేయబడిన బోర్డులు, కార్పొరేషన్లు, సహకార సంఘాలు లేదా ఎన్జీఓలలో సభ్యత్వం 36. భూముల యాజమాన్యం, ధరణి పాస్‌బుక్ వివరాలు సహా 37. వ్యవసాయ రుణాలు 38. పశుసంపద యాజమాన్యం 39. ఇతర స్థావర స్థిరాస్తులు 40. చలస్తావర ఆస్తులు 41. కుటుంబ పరిమాణం 42. గృహం రకం (తమనిది/అద్దె) 43. ప్రాథమిక సదుపాయాల ప్రాప్తి (నీరు, విద్యుత్, పారిశుద్ధ్యం 44. ఆరోగ్య సదుపాయాల ప్రాప్తి 45. ప్రభుత్వ ఆరోగ్య పథకాల వినియోగం 46. ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగం 47. ప్రజా పంపిణీ వ్యవస్థ (%ూణూ%) ప్రాప్తి 48. రేషన్ కార్డు కలిగి ఉండటం 49. రేషన్ కార్డు రకం (%ూూూ, దీూూ%, అంత్యోదయ, మొదలైనవి) 50. కుటుంబంలో వృద్ధ సభ్యులు ఉండటం 51. కుటుంబంలో ఆరేళ్లలోపు పిల్లలు ఉండటం 52. దీర్ఘకాలిక వ్యాధులు లేదా వైకల్యం ఉన్న సభ్యులు 53. వంట ఇంధనం రకం (%ూూ+%, కిరోసిన్, కట్టెలు, మొదలైనవి) 54. డిజిటల్ పరికరాల ప్రాప్తి (స్మార్ట్‌ఫోన్స్, కంప్యూటర్లు) 55. ఇంటర్నెట్ కనెక్టివిటీ అందుబాటులో ఉండట 56. యాజమాన్యంలోని రవాణా సదుపాయాలు (బైక్,


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

కారు, సైకిల్) 57. సమీప పాఠశాలకు దూరం 58. సమీప ఆరోగ్య కేంద్రానికి దూరం 59. సమీప మార్కెట్‌కు దూరం 60. కుటుంబం యొక్క ప్రధాన ఆదాయ వనరు 61. కుటుంబ నెలవారీ వ్యయం 62. పొదుపు మరియు పెట్టుబడుల వివరాలు (ఉండే పక్షంలో) 63. సూక్ష్మ రుణాలు లేదా స్వయం సహాయక సమూహాల ప్రాప్తి 64. ప్రభుత్వ పథకాల గురించి అవగాహన 65. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలలో పాల్గొనడ 66. సహకార సంఘాలలో సభ్యత్వం 67. సామాజిక భద్రత ప్రయోజనాలు (పెన్షన్, ఇన్సూరెన్స్) 68. సామాజిక లేదా సంఘ సాంకేతిక సంస్థలలో భాగస్వామ్యం 69. రాజకీయ అవగాహన స్థాయి 70. ఇటీవల ఎన్నికలలో ఓటు వేసిన తీరు 71. నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొనడం 72. వ్యవసాయ ఆధారిత కార్యకలాపాలలో పాల్గొనడం 73. వ్యవసాయ పరికరాల యాజమాన్యం 74. సాగు చేసే పంటల రకాలు (ఉండే పక్షంలో) 75. సేద్యం సదుపాయాల ప్రాప్తి 76. ఎరువులు మరియు పురుగుమందుల వినియోగం 77. ఆర్గానిక్ వ్యవసాయం (ఉండే పక్షంలో) 78. పశు సంవర్ధకంలో భాగస్వామ్యం 79. చేపల పెంపకం లేదా జలచరాలు (ఫిషరీస్) సదుపాయాలు 80. కుటుంబం నుండి వలస వివరాలు (ఉండే పక్షంలో) 81. కాలానుగుణ వలస ధోరణులు (ఉండే పక్షంలో) 82. ప్రభుత్వ పథకాల కింద ఉద్యోగం (ఉదా: MGNREGA) 83. అందిన ప్రభుత్వ సహాయ పథకాల రకాలు (ఉండే పక్షంలో) 84. అంతర్గత కుల వివాహాల కుటుంబ చరిత్ర 85. ఇంట్లో మాట్లాడే భాషలు 86. పారిశుద్ధ్య సదుపాయాల ప్రాప్తి (ముగ్గులు) 87. డిజిటల్ లిటరసీ కార్యక్రమాల అవగాహన మరియు వినియోగం 88. సాంస్కృతిక లేదా మత ఉత్సవాలలో పాల్గొనడం 89. శిశు సంరక్షణ సదుపాయాల ప్రాప్తి 90. సాంప్రదాయ లేదా కళారూప వృత్తుల్లో భాగస్వామ్యం 91. సామాజిక వివక్ష అనుభవాలు (ఉండే పక్షంలో) 92. రుణాలు లేదా క్రెడిట్ సదుపాయాల ప్రాప్తి 93. రుణాల చెల్లింపు స్థితి 94. ఆరోగ్యం, జీవితం లేదా ఆస్తికి బీమా కవరేజ్ 95. వృద్ధాప్య సహాయ పథకాల ప్రాప్తి లేదా పెన్షన్ ప్లాన్లు 96. పునరుత్పత్తి శక్తి వనరులు యాజమాన్యం (సోలార్ ప్యానెల్స్, బయోగ్యాస్) 97. రాజకీయ పార్టీలు లేదా సమూహాలలో సభ్యత్వం 98. చట్టపరమైన హక్కులపై కుటుంబం అవగాహన 99. వృత్తి విద్య లేదా వయోజన విద్యలో పాల్గొనడం 100. కుటుంబంలో ఆధారపడే వారు (పిల్లలు, వృద్ధులు మొదలైనవి) 101. కుటుంబం యొక్క విద్యుత్ వినియోగ నమూనాలు 102. వినోద సదుపాయాల ప్రాప్తి 103. వార్తలు లేదా మీడియా వనరులకు రెగ్యులర్ ప్రాప్యత 104. వాతావరణ మార్పులపై అవగాహన స్థాయి 105. సమాజ భద్రతపై అవగాహన 106. సమాజ నిర్ణయాలలో భాగస్వామ్యం 107. ఆహార భద్రత స్థితి 108. కిచెన్ గార్డెనింగ్ లేదా ఇంటి వెనుక భూమిలో సాగు 109. కుటుంబ మురుగు నిర్వహణ పద్ధతులు 110. స్థానిక పండుగలు లేదా సంప్రదాయాలలో పాల్గొనడం 111. అత్యవసర పరిస్థితుల్లో (వర్షం, ఎండ drought ) సమాజం నుంచి సహాయం 112. స్థానిక దాతృత్వం లేదా సంక్షేమ కార్యక్రమాలకు కుటుంబం సహాయం

# తెలంగాణలో కుల గణన.. గ్రామాల్లో పెరిగిన హడావుడి..!!

ప్రజా స్వేచ్ఛ
సమగ్ర, సామాజిక, ఆర్థిక, కులగణనకు తెలంగాణ సర్కారు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. కులాల వారీగా జనాభాను లెక్కించడం మాత్రమే కాదు.. త్వరలో చేప్టనున్న జనగణన కార్యక్రమాన్ని బహుళ ప్రయోజనాలే లక్ష్యంగా ప్రభుత్వం కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. ఒషన్ కార్డుల జారీ ప్రక్రియకు అర్హుల ఎంపిక, హెల్త్ ప్రొఫైల్ డాటా సేకరణ, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, మహిళలకు రూ.రెండున్నర వేల ఆర్థిక భృతి తదితర కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని కులగణన రోడ్ మ్యాపు రూపొందించారు. ఈ నెల 6 నుంచి మూడు వారాల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి జారీ చేసిన మార్గదర్శకాల మేరకు అన్ని జిల్లాల



కలెక్టర్లకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు ఇచ్చారు. ఆ ప్రకారం కలెక్టర్లు తమతమ జిల్లాలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికలను రూపొందించుకున్నారు ఏడు కీలక విభాగాల అధికారుల సంయుక్త భాగస్వామ్యంతో సమగ్ర కులగణన కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. అందుకుగానూ సుమారు 85 వేల పైచిలుకు అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలకు, ముఖ్యంగా మెగా హెల్త్ చెకప్ లో ఉపయోగపడేలా ఈ కార్యక్రమం ద్వారా పూర్తిస్థాయి సమాచార సేకరణ చేయనున్నారు. సమగ్ర ప్రభుత్వాదేశాల మేరకు క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం కులగణనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు ఇంటింటి కుటంబ సర్వేకోసం అవసరమైన వనరులను, రికార్డులను గ్రామాలకు పంపించారు. సర్వేలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వడంతో త్వరలో జరగనున్న సమగ్ర కుల గణనలో రాష్ట్ర ప్రజలందరూ భాగస్వాములు కావాలని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. భవిష్యత్తులో అన్ని పథకాలకు ఈ సర్వే, మెగా హెల్త్ చెకప్ ఉపయోగ పడుతుందన్నారు.

# విధి వంచించిన దంపతులకి అండగా సింగిరెడ్డి దోసిలి ఫౌండేషన్

మారం, ప్రజా స్వేచ్ఛ
భీమారం మండల కేంద్రానికి చెందిన చిలివేరి జమున- శంకర్ దంపతులు పక్షవాతం బారినపడి 4 ఏండ్లు గా అవస్థ పడుతున్నా సమాచారాన్ని గల్ఫ్ ఉద్యమా నాయకులు గుగ్గిళ్ల రవి గౌడ్ ద్వార తెలుసుకున్నా, సింగిరెడ్డి దోసిలి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి టీపీసీసీ గల్ఫ్ కన్వీనర్, భీమారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమారం మండల కేంద్రానికి చెందినా



నాయకులు,యువకులతో కలిసి ఆదివారం రోజు బాధిత కుటుంబాన్ని సందర్శించారు, బాధిత కుటుంబా ఆరోగ్య ,ఆర్దిక పరిస్థితి గురించి గ్రామస్తులు నరేష్ రెడ్డిగారికి వివరించరు. వెంటనే తక్షణ సహాయం కింద 5000/- రూపాయిలు అందిస్తూ, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని, అట్లాగే భవిష్యత్ లో సింగిరెడ్డి దోసిలి ఫౌండేషన్ ద్వారా మరింత అండగా ఉంటామని భరోసా అందించారు ఈ కార్యక్రమం లో తేలు నరేష్ గుగ్గిళ్ళ రవిగౌడ్,బక్కురి నరేష్,ముంజ కిషన్, దువాసరామకృష్ణ, హైమ్మద్, లక్ష్మీపతి గౌడ్, శేఖర్, గంగారాజం, తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాలి

## - ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి

వలిగొండ నవంబర్ 3 ప్రజా స్వేచ్ఛ



రైతులు పండించిన వరి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు వ్యవసాయ మార్కెట్ మరియు ఐకెపి పి,ఎ,సి,ఎస్, సెంటర్స్ నందు వరి ధాన్యాన్ని కొనుగోలు చేయకపోవడంతో రైతులు అనేక ఇబ్బందుల పాలు కావడం జరుగుచున్నది మార్కెట్ ప్రారంభోత్సవాలు చేసి రోజులు గడుస్తున్న ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతున్నదని వెంటనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేశారు వలిగొండ మండల బిఆర్ఎస్ పార్టీఅధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి పట్టణ అధ్యక్షులు ఎండి, అఫ్రోజ్

# కిసాన్ క్రెడిట్ కార్డు.. రైతులకు రూ.3 లక్షలు



ప్రజా స్వేచ్ఛ
కేంద్ర ప్రభుత్వం 'కిసాన్ క్రెడిట్ కార్డు' పథకాన్ని రైతుల కోసం అమలు చేస్తోంది. దీని ద్వారా 7 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో రైతులు లోన్ పొందొచ్చు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులకు బీమా కూడా ఉంది.వారు చనిపోయినా,అంగవైకల్యం ఏర్పడినా రూ.50 వేల బీమా అందుతుంది. ప్రస్తుతం దీనిని ప్రధానమంత్రి ఫసల్ బీమాయోజనతో అనుసంధానించారు.ఈ కార్డు కోసం స్థానిక బ్యాంకులలో సంప్రదించవచ్చు.


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# ఉచిత సిలిండర్ పొందాలంటే.. ఇవి తప్పనిసరి



ప్రజా స్వేచ్ఛ
-ఉచిత గ్యాస్ సిలిండర్ పథకానికి తాము అర్హులమా? కాదా? అనే అనుమానాలు లబ్ధిదారుల్లో వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారులు క్లారిటీ ఇచ్చారు.
- రేషన్ కార్డు, ఆధార్, గ్యాస్ కనెక్షన్ తప్పనిసరి.
- కుటుంబ సభ్యులలో ఎవరి పేరు మీద కనెక్షన్ ఉందో.. ఆ వ్యక్తి పేరు రేషన్ కార్డులో ఉంటే రాయితీ వస్తుంది.
- భార్య పేరుతో రేషన్ కార్డు, భర్త పేరుతో గ్యాస్ కనెక్షన్ ఉన్నా అర్హులే.
- రాయితీ కోసం ఈ కేవైసీ పూర్తి చేయాలి.
- సమస్యలుంటే 1967 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.


తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి

# సంక్షేమ పథకాలను పేదలకు అందేలా చూడాలి

**-సిపిఐ**

**-కె ఎల్ ఆర్ కు వినతి పత్రాన్ని అందజేసిన సిపిఐ నాయకులు**




**ప్రజా స్వేచ్ఛ ఎల్ బి నగర్, నవంబర్ 3:** మహేశ్వరం నియోజకవర్గం లో అభివృద్ధి పనులు చేపట్టాలనీ సంక్షేమ పథకాలను అర్హులైన వారికి గుర్తించి అమలు చేయాలనీ కోరుతూ సీపీఐ నాయకులు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కె ఎల్ ఆర్ ను కలసి విజ్ఞప్తి చేశారు.భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కామ్రేడ్ ఆందోజు రవీంద్ర చారి ఆధ్వర్యంలో సిపిఐ బాలాపూర్ మండల పార్టీ నేతలు మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచ్చన్న గారి లక్ష్మారెడ్డి కలిసి సమస్యలపై వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో । పారిశుద్ధ్యం, రోడ్లు,పచ్చదనం పరిశుభ్రత, కరెంటు, మంచినీరు వంటి మౌలిక సదుపాయాలతో పాటు వివిధ ప్రాజెక్టులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా ప్రజల సమస్యలు తీర్చే విధంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే సంక్షేమ పథకాలను మహేశ్వరం నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికి అందే విధంగా కృషి చేయాలని నియోజకవర్గ అభివృద్ధి కోసం మరిన్ని నిధులు ప్రత్యేకంగా ప్రభుత్వంతో మాట్లాడి విడుదల చేయించాలని పగడ్బందీగా అవినీతికి తావు లేకుండా అర్హులైన వారిని గుర్తించి ఇల్లు లేని వారికి ఇండ్లు మరియు ఇండ్ల స్థలాలు, పింఛన్లు అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అలాగే సబ్సిడీ లోన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.లక్ష్మారెడ్డి మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గం అభివృద్ధి కోసం కట్టుబడి ఉన్నామని పేదలకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తామని పార్టీలకతీతంగా పనిచేస్తామని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ బాలాపూర్ మండల కార్యదర్శి ముకుంద గారి చంద్రశేఖర్ రెడ్డి, గిరిజన సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివ నాయక్, మహిళా సమాఖ్య జిల్లా సహాయ కార్యదర్శి బండ యాదమ్మ యాదవ్, లెనిన్ నగర్ సిపిఐ పార్టీ శాఖ కార్యదర్శి పిచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

## గృహప్రవేశ మహోత్సవంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి



**ప్రజా స్వేచ్ఛఎల్ బి నగర్, నవంబర్ 3:** మహేశ్వరం నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ పన్నాల కృష్ణారెడ్డి బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్ గుల్ గ్రామంలోని కింగ్స్ వే గేటెడ్ కమ్యూనిటీలో నూతనంగా నిర్మించిన విల్లా గృహప్రవేశ మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ,మహేశ్వరం ఎమ్మెల్యే శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. కృష్ణారెడ్డి దంపతులకు ఆమె శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ కవర్ వాడకు ప్రాణాలు తీయకు

**-జెండర్ టాస్ కమిటీ ప్రొద్దుటూరు**





**శంకర్ పల్లి ప్రజా స్వేచ్ఛ నవంబర్ 3:** శంకర్ పల్లి మండలం పొద్దుటూరు గ్రామంలో పర్యావరణం పరిశుభ్రతలో భాగంగా జెండర్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంవి ఫౌండేషన్ నాగమణి, ఎమ్మెస్ ఎఫ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మరియు జెండర్ కమిటీ సభ్యులు నాని భాను ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణం పరిశుభ్రత అనేది మన అందరి బాధ్యత మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ మన ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని మన తాత ముత్తాతల నుండి వచ్చే ఆనవాయితీ సంచి వెంట తీసుకుపోయే వారు కాబట్టి అప్పటి వారు ఆరోగ్యంగానూ కాలుష్యరైతంగాను ఉండే వారని కాబట్టి ఆ రోజులను మళ్లీ మనమంతా నిర్మించుకోవాలంటే ప్లాస్టిక్ ను పారదోసి ప్రతి ఒక్కరి దగ్గర ఫోను ఎట్లాగైతే ఉంటుందో అదేవిధంగా గోనె సంచి వంటి దాన్ని ఉపయోగించుకొని ప్లాస్టిక్కు నివారిద్దామని మన ప్రాణాలను కాపాడుకుందామని కాలుష్యరైత సమాజాన్ని నిర్మిద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు జడ్పిహెచ్ఎస్ చైర్మన్ ఏనుగు లక్ష్మి, బిల్ కలెక్టర్ మల్లేశం, జెండర్ కమిటీ సభ్యులు లేగల భాగ్యమా, చాకలి శిరీష, మానస, నందిని, రేఖ, చందన, కార్తీక్, సతీష్, జశ్వంత్, పవన్ సిద్దు, రోహిత్, సంజన, రాధా, మధుప్రియ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు మానసిక వికాసానికి దోహదం...

**టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం.**




**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ నవంబర్ 3:** కరాటే క్రీడా శారీరక దారుఢ్యానికి ప్రతీక అని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పేర్కొన్నారు. కూకట్ పల్లిలోని శ్రీ పుల్లారి నారాయణదాస్ కల్యాణ మండపంలో జరిగిన 5వ నేషనల్ లెవల్ ఓపెన్ కరాటే, కుంగ్ ఫు, తవైకాండో ఛాంపియన్ షిప్ 2024 పోటీ కార్యక్రమంలో కర్ణాటక, మహారాష్ట్ర, బెంగళూరు, ముంబాయి, తెలంగాణ లోని నాగర్ కర్నూల్, వరంగల్, పెద్ద పల్లి జిల్లాల నుండి 450 మంది విద్యార్థులు పోటీలో పాల్గొన్నారు. నీ యుద్ధ లీ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వాహకులు టి.సంతోష్ కుమార్ ఆహ్వానం మేరకు టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ ఆటల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించి లక్ష్యం దిశగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ప్రతిభ కనబరించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మేడల్స్, బహుమతులు ఆయన చేతులమీదుగా అందచేశారు. ఈ కార్యక్రమంలో షీ టీం లక్ష్మి రుద్రమ దేవి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ ఫౌండర్, బి బ్లాక్ అధ్యక్షులు తూము వేణు, బాలాజీ నగర్ డివిజన్ అధ్యక్షులు కృష్ణ రాజ్ పుత్, రవి, శ్రీధర్, సత్య శంకర్ తదితర మాస్టర్లు, అకాడమీ సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వనస్థలి నేషనల్ పార్క్ లో జరిగిన కార్తీక వనభోజన కార్యక్రమం





**ప్రజా స్వేచ్ఛ వనస్థలిపురం, నవంబర్ 3:** హయత్ నగర్ ఆసరా కమిటీ సభ్యులు ఆదివారం నిర్వహించిన కార్తీక వనభోజన మహోత్సవంను ఆటో నగర్ లోని మహావీర్ హరినా వనస్థలి నేషనల్ పార్క్ లో నిర్వహించారు. ఈ కార్తీక వన భోజన మహోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాల్గొన్న బీజేపీ రంగా రెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగా రెడ్డి .హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి లు పాల్గొన్నారు ,ఈ సందర్భంగా పలువురు సీనియర్ సిటిజెన్ సభ్యులు కేంద్ర ప్రభుత్వం ఆసరా కమిటి సభ్యుల కోసం చేపడుతున్న పథకాలను మరియు వాటిలోని లోపాలను సభలో వివరించగా కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్ గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ దృష్టికి తీసుకెళ్లి కేంద్ర ప్రభుత్వం ఆసరా కమిటి సభ్యుల కోసం చేపడుతున్న పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపరిచే విధంగా చూస్తామనీ తెలిపారు,ఈ కార్యక్రమంలో హయత్ నగర్ సర్కిల్ ఆసరా కమిటీ అధ్యక్షులు పట్టి యాది రెడ్డి ,మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహా రెడ్డి ,నాగోల్ డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ సురేందర్ యాదవ్ ,మన్సూరాబాద్ మాజీ కౌన్సిలర్ ఈశ్వరమ్మ యాదవ్, అలాగే 28 సీనియర్ సిటిజెన్ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ సంస్థల గుత్తాధిపత్యాన్ని, వర్గ పోరాటాలతా నిర్మూలించినప్పుడే నిజమైన నివాళి,,

**-సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ,రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చలపతిరావు,,**



**గోదావరిఖని, ప్రజా స్వేచ్ఛ నవంబర్,3** కేంద్ర ప్రభుత్వ మతోన్మాద, కార్పోరేట్ సంస్థలగుత్తాదిపత్యాన్ని వర్గ పోరాటాలతో నిర్మూలించినపుడు మాత్రమే అమరులకు నిజమైన నివాళిఅని జేవి చలపతిరావు సిపిఐ,ఎం-ఎల్, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యధర్శి వర్గ సభ్యులు,జె.వి చలపతిరావు. ఐ ఎఫ్ టీ యు. రాష్ట్ర కార్యదర్శి, ఎం శ్రీనివాస్, అన్నారు. భూమి,భుక్తి, ఈదేశ విముక్తికై అసువులు బాసిన అమరుల స్మరిస్తూ.ఆదివారం “ఎన్ టి పి సి” ఐ ఎఫ్ టి యు కార్యాలయం వద్ద సిపిఐ ఎం-ఎల్, న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె రాజన్న అధ్యక్షతన, సంస్మరణ సభ” జరిగింది,ఈ సభ ప్రారంభం,కుముందు 2 నిమిషాలు అమరవీరులను స్మరిస్తూ మౌనం పాటించడం జరిగింది, ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరై వారు మాట్లాడుతూ..సిపిఐ ఎం-ఎల్, న్యూడెమోక్రసీ,పిలుపు లో బాగంగా ప్రతి సంవత్సరం నవంబర్ 01 నుండి 09 వరకు భూమి, భుక్తి,ఈదేశ విముక్తి కోసం ప్రాణాలర్పించిన కమ్యూనిస్టు విప్లవకారుల “సంస్మరణ సభ” ను జరుపుకుంటామని, ఆదివారం.జరిగే ఈసభ లో కేంద్ర, రాష్ట్ర నాయకులతో పాటు పెద్దపల్లిజిల్లానాయకులు, కార్యకర్తలు పార్టీ సభ్యులుఅనేక మంది, దేశంలో నూతన ప్రజాస్వామ్య విప్లవం విజయవంతం కోసం పోరాడుతూ అమరులైనవారందరికీ, సిపిఐ ఎం-ఎల్, న్యూడెమోక్రసీ విప్లవ జోహార్లు అర్పిస్తుందని, వారి త్యాగాలను, ఆదర్శాలను,స్ఫూర్తిని నింపుకొని భవిష్యత్ కార్యాచరణకు శపథం తీసుకుంటున్నదని అన్నారు,మార్క్సిజం - లేనినిజం - మావో ఆలోచన విధానాన్ని ప్రాపంచిక దృక్పదంగా ఎంచుకుని మహత్తర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో ఉత్తేజితమై దేశంలో అనేక రైతాంగ పోరాటాలు శ్రీకాకుళ, గోదావరి లోయ పోరాటాలు ముందుకువచ్చాయని, దేశంలోకొనసాగుతున్న అర్ధవలస-అర్ధభూస్వామ్య దోపిడీ వ్యవస్థను కూకటి వేళ్ళతో సహా కూల్చివేయకుండా ప్రజలుఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కారం కావు అనేది గత ఏడున్నర దశాబ్దాల ఆచరణ రుజువు చేసిందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు సాగిస్తూనే పాలకులు ముందుకు తెస్తున్న అభివృద్ధి నిరోధక, దోపిడీ, అణిచివేత విధానాలపై సంఘటిత, సమరశీల, ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ ప్రతిఘటన పోరాటాలను మరింత పదును పెట్టుకొని మునుముందుకే సాగాల్సిన అవసరం ఉన్నదని అన్నారు.అవసరాలకు అనుగుణంగానే రాష్ట్రంలో గత పది ఏళ్లకు పైగా విడివిడిగా ఉండీ పనిచేస్తున్న రెండు సిపిఐ,ఎం-ఎల్, న్యూడెమోక్రసీ పార్టీలు ఒకే పార్టీ గా ఐక్యమయ్యే వైపుగా ముందుకు సాగుతున్నాయని, ఈ ఐఖ్యత లో భాగంగానే “సంస్మరణ సభ” నిర్వహించుకుంటున్నామనని అన్నారు.ఈ సభలో ఐ ఎఫ్ టి యు.రాష్ట్ర అధ్యక్షులు ఐ క్రిష్ణ, జిల్లా అధ్యక్షులు. ఇ నరేష్,ఇ రామకృష్ణ, జిల్లా కార్యదర్శి, బి అశోక్,పి సి కె ఎస్ జిల్లా కార్యదర్శి చిలుక శంకర్,పి ఓ డబ్ల్యు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె జ్యోతి, అరుణోదయ రాష్ట్ర నాయకులు బతుకులరాజన్న, అఖిలభారత రైతు-కూలీ సంఘం అధ్యక్షులుమేరుగు చంద్రయ్య,సిపిఐ ఎం-ఎల్, న్యూడెమోక్రసీ మండల లకార్యదర్శి కొల్లూరి మల్లేష్, ఐ ఎఫ్ టి యు, జిల్లా నాయకులు కె లింగమూర్తి,పి వై ఎల్ జిల్లాకార్యదర్శి ఆరుమూళ్ళ తిరుపతి, ప్రసంగించారు. అనంతరం సభలో అమరవీరుల ను స్మరిస్తూ అరుణోదయ కళాకారులు అమరవీరుల గేయాలు ఆలపించారు.ఈ కార్యక్రమంలో బి బుచ్చయ్య, ఎం దుర్గన్న,కె మొగిలి, ఎం కొమరయ్య,ఎడ్ల రవికుమార్, బి కొమురయ్య,ఆర్ రాయమల్లు, పుష్పక, దేవయ్య, బొంతుఆనంద్,పైడిపల్లి రమేష్,గొట్టె శంకర్, వేల్పుల సాంబయ్య,కలువల మహెందర్,పి వెంకటస్వామి, డి బుచ్చమ్మ,ఇ బాబు, s వెంకటస్వామి,ఎస్ రవి,సుధాకర్,ఎస్ రాయ మల్లమ్మ,పి లక్ష్మి,స్వరూప, మంగ పాల్గొన్నారు.

## మంచికట్ల దయాకర్ 26డివిజన్,కార్పొరేటర్ తల్లి మృతిచెందగా వారి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**గోదావరిఖని, ప్రజా స్వేచ్ఛ నవంబర్. 3:** గోదావరిఖని 26 డివిజన్ కార్పొరేటర్ & హొండా షోరూం యజమాని మంచికట్ల దయాకర్, తల్లి అనారోగ్యం తో మృతి చెందాగా శనివారం రాత్రి, రామగుండం ఎమ్మెల్యే, మక్కన్ సింగ్,వారి నివాసనికి వెళ్లి పర్మర్శించారు. వీరి వెంట కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు ఉన్నారు.



# యువ సైనిక్ యూత్ ఆధ్వర్యంలో నవయుగ చేతన గ్రంధాలయానికి స్వతంత్ర సమరయోధుల చిత్రపటాలు



**ప్రజా స్వేచ్ఛ చిట్యాల నవంబర్ 03:** యువ సైనిక్ యూత్ ఆధ్వర్యంలో స్వాతంత్ర సమరయోధుల చిత్రపటాలు తాళ్ల వెల్లంల గ్రామంలోని నవయుగ చైతన్య గ్రంథాలయంలో ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో యువ సైనిక్ యూత్ సభ్యులు మరియు గ్రంథాలయ కమిటీ సభ్యులు అలాగే గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది దీనికి యువసైనిక్ యూత్ సభ్యులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నాం. అలాగే యువత సేవ పథంలో ముందుండాలని ఆశిస్తున్నామని పెద్దలు ఈ కార్యక్రమంలో తెలిపారు, యువ సైనిక్ యూత్ (యూత్ ఫర్ సేవ) అధ్యక్షులు ఉయ్యాల సాయి ఉపాధ్యక్షులు బత్తుల అనిల్ గౌడ్ మరియు యూత్ సభ్యులు గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ పెద్దలు పజ్జూరి అజయ్ కుమార్ రెడ్డి, ఏరుకొండ నరసింహ, జనగం నరసింహ, కట్ట వెంకటేశం, గట్టోజు శ్రీనివాస్, గిరిబాబు, నకరికంటి నాగేష్, కంపె నరేష్, పందుల అంజయ్య, కోదూరు శివ గ్రామ పెద్దలు యూత్ సభ్యులు జగన్ స్వామి గణేష్ శరత్ యశ్వంత్ శివ మధు వంశీ కిశోర్ తదితరులు పాల్గొన్నారు

## గ్యార్వీ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛ నవంబర్ 3:** హైదర్ నగర్ గ్రామ పరిధిలోని దర్గా వద్ద ముస్లిం మైనార్టీ ప్రజలు నిర్వహించిన గ్యార్వీ వేడుకల్లో కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలోని అన్నీ మతాలు కులాలు ఒక్కటే అనే విషయాన్ని గుర్తించి మత సామరస్యంతో అందరూ ముందుకు వెళ్లాలని అన్నారు. అన్నీ మతాల సారం ఒక్కటేనని, ఒకరికి ఒకరూ ప్రేమా ఆప్యాయతలతో సహాయపడుతూ దేశాన్ని ముందుకు తీసుకువెళ్లాలని సూచించారు. హైదర్ నగర్ ప్రాంతం తనకు రాజకీయంగా పుట్టినిల్లు వంటిదన్నారు. ప్రజా ప్రతినిధిగా మొదటి ప్రస్థానం హైదర్ నగర్ లో ప్రారంభమైందని అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందటం జరిగిందన్నారు. తనను కౌన్సిలర్ గా గెలిపించిన హైదర్నగర్ ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషిచేసినట్లు తెలిపారు. శ్మశాన వాటికలకు, పాఠశాలలకు, ప్రార్థన స్థలాల కోసం భూములను ఆరోజుల్లోనే అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, మొహమ్మద్ గౌసుద్దీన్, గొట్టిముక్కల బాస్కర్ రావు, స్థానిక నాయకులు కలీమ్, నక్క శ్రీనివాస్, న్యాయవాది శ్రీకాంత్, నర్సింగరావు, వెంకటేష్, సలీమ్, మహిళ నాయకురాలు జుబేదా బేగం, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ఇండియన్ గ్రాండ్ మాస్టర్ అర్జున్ కు సత్కారం...



**కరీంనగర్ ప్రజా స్వేచ్ఛ నవంబర్ 03:** ప్రపంచ చెస్ , ఒలంపియాడ్ లలో అద్వితీయ ప్రతిభ కనబరిచి విజయాలు సాధించిన ఇండియన్ గ్రాండ్ మాస్టర్ ఎరగైసి అర్జున్ ను ఆదివారం కరీంనగర్ జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి అను కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.భారత నెంబర్ వన్ గ్రాండ్ మాస్టర్ ప్రపంచ 3వ చదరంగం ఆటగాడిగా అర్జున్ 2800 రేటింగ్ నమోదు చేసి తొలిసారి గా తన స్వగృహం వరంగల్ కు వచ్చిన శుభ సందర్భాన్ని పురస్కరించుకొని జీనియస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో అర్జున్ పాటు అతని తల్లిదండ్రులపూల ను ఘనంగా సన్మానించారు. చెస్ లో భారత్ ను ప్రపంచ నెంబర్ వన్ గా నిలపడమే తన లక్ష్యమని, భవిష్యత్తులో మెరుగైన కోచింగ్ తీసుకొని ముందుకు వెళ్తానని, చెస్ లో రాణించేందుకు ప్రతి ఒక్క క్రీడాకారులు ముందుకు రావాలని అర్జున్ తెలిపినట్లు జీనియస్ చెస్ అకాడమీ కోచ్, డైరెక్టర్ కంకటి అనుకుమార్ ఈ సందర్భంగా తెలిపారు. చెస్ క్రీడారంగంలో అర్జున్ ఇండియా నంబర్ వన్ గా, ప్రపంచ మూడో స్థానంలో ఉండడం తెలంగాణకి గర్వకారణమని, రాబోయే రోజుల్లో తెలంగాణకు పేరు తేవాలని అను కుమార్ కోరారు. ఈ కార్యక్రమంలో జీనియస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకులు కంకటి కనకయ్య, అర్జున్ తల్లిదండ్రులు డాక్టర్ శ్రీనివాస్ జ్యోతి, కోచ్ సృజన్ కుమార్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డుపై ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించండి.

-జనంపల్లి పురేందర్ రెడ్డి...



**కూకట్ పల్లి ప్రజా స్వేచ్ఛే నవంబర్ 3:** విద్యుత్ వినియోగదారుల దినోత్సవాన్ని కెపిహెచ్బి కాలనీలో విద్యుత్ అధికారులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ విద్యుత్ మేడ్చల్ జిల్లా చీఫ్ ఇంజనీర్ డి.ఈ, కూకట్ పల్లి ఏ.డి.ఈ, ఏ.ఈ చైతన్య, లైన్ మెన్ లు ఇతర ఉన్నత అధికారులు ఈ కార్యక్రమానికి హాజరై వినియోగదారుల నుండి పలు సూచనలు అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా వివేకానంద నగర్ డివిజన్ రామకృష్ణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు జనంపల్లి పురేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ తమ కాలనీలో ఏ.ఈ చైతన్య ఆధ్వర్యంలో చెట్ల కొమ్మలు, నూతన విద్యుత్ స్తంభాలు వివిధ కేబుల్ లైన్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే కాలనీలో మరి కొన్ని కేబుల్ వైర్లు, రోడ్ల వెంబడి ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి నూతన స్తంభాలను ఏర్పాటు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ముఖ్యంగా ఉషా ముళ్ళపూడి రోడ్ లో రోడ్డుకి ఇరువైపులా విద్యుత్ స్తంభాలు రోడ్డుపైన ఉండటం వలన ప్రజలకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతుందని వెంటనే అధికారులను రోడ్డుపై ఉన్న విద్యుత్తు స్తంభాలను తొలగించి కాలనీలో కేబుల్ వైర్లు ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు.

## పవిత్ర ఉమ్రా యాత్ర కు వెళ్లుచున్న ముస్లిం సోదరులను సన్మానించిన ఎమ్మెల్యే మాణిక్ రావు...



**జహీరాబాద్ ప్రజా స్వేచ్ఛ నవంబర్ 03:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణానికి చెందిన వి6 సీనియర్ జర్నలిస్ట్ అయూబ్ ఖాన్ మరియు మహమ్మద్ జాఫర్, మహమ్మద్ చాంద్ లు నేడు పవిత్ర ఉమ్రా యాత్ర కు బయలుదేరుతున్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్థానిక శాసనసభ్యులు కొణింటి మాణిక్ రావు వారిని శాలువా పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాణిక్ రావు మాట్లాడుతూ ఉమ్రా యాత్రకు వెళ్తున్న మీరు స్థానిక ముస్లిం సోదరులందరి తరపున దర్శనం చేసుకొని అల్లహ దయతో జహీరాబాద్ ప్రాంత ప్రజలు శాంతిగా ఉండాలని కాంక్షించాలని,ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకోవాలని వారితో కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ పట్టణ అధ్యక్షులు యాకూబ్, అలి, జుబేర్, పెద్ధగొల నారాయణ, వహీద్, జాకీర్, ఫయాజ్, ఫాహిమ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యండి..

-జిల్లా కార్యదర్శి పి.సత్తం



**కూకట్ పల్లి/ ప్రజా స్వేచ్ఛ నవంబర్ 3:** ప్రగతి నగర్ లో జరిగే సిపిఎం పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా 3వ, మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి పి.సత్యం కోరారు. ఆదివారంబాలానగర్ లోని పార్టీ కార్యాలయంలో శాఖ కార్యదర్శి ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ జిల్లా మహాసభలను జయప్రదం చెయ్యడంలో కూకట్ పల్లి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గాల ప్రజల సహకారం అందించాలని కోరారు. గత 3సం. లలో జరిగిన పోరాటాలు భవిష్యత్ లో జరిపే పోరాటాల తీర్మానాలను ఆమోదిస్తుందన్నారు. దేశంలో, రాష్ట్రంలో ప్రజా వ్యతిరేక విధానాలకు అవలంభిస్తున్నాయి అని అన్నారు. ముఖ్యంగా మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 5 నియోజకవర్గాలు ఉన్నాయి. ప్రతి నియోజవర్గం లో 100పడకల ప్రభుత్వ హాస్పిటల్ లను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా మేడ్చల్ జిల్లాలో ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు ఏర్పాట్లు చెయ్యాలి. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారెంటీ లను వెంటనే అమలు చెయ్యాలని, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కృష్ణ రావు, జిల్లా కమిటి సభ్యులు వెంకట్ రామయ్య, ఐలాపురం రాజశేఖర్, కీలుకాని లక్ష్మణ్, ఎం. శంకర్, ఎం. నరేష్,జిల్లా నాయకులు లింగస్వామి, ఏ. విజయ, శివ ప్రసాద్, పి. శంకర్,చైతన్య తదితరులు పాల్గొన్నారు.

# మెరుగైన ఆరోగ్యానికి సహజయోగ ధ్యానం

-చైతన్య రథం ప్రారంభిస్తున్న గౌరీ శంకర్ సభ్యులు



**కరీంనగర్,/ ప్రజా స్వేచ్ఛ నవంబర్ 03:** కరీంనగర్ లోని జ్యోతినగర్ లో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో సహజ యోగ ధ్యానమును పరమపూజ్య ఈ సహజ యోగను కరీంనగర్ జిల్లాలోని చుట్టుపక్కల అన్ని గ్రామాల్లో మండల కేంద్రంలో అవగాహన ఇచ్చేందుకు రైతులకు విద్యార్థులకు యువతకు సహజ యోగ పద్ధతులను అవగాహన కల్పించేందుకు ఈరోజు చైతన్య రథం ప్రారంభించడం జరిగింది, శ్రీ మాతాజీ నిర్మలాదేవి 1970 లో ఆవిష్కరించారు, ఇది ప్రతి మనిషిలో ఉన్న కుండలినీ శక్తిని భగవంతుని శక్తితో అనుసంధానం చేసే పరిపూర్ణమైన ధ్యాన ప్రక్రియ. ఈ ప్రక్రియ ద్వారా అతి సులువుగా ఆత్మ సాక్షాత్కారమును పొందుతాము. అప్పుడు మన తలపై భాగాన గల మాడు ప్రదేశంలో గాని, అరచేతులందు గాని చల్లని చైతన్య తరంగాల రూపంలో భగవంతుని ప్రేమ శక్తిని అనుభూతి చెందుతాము. సహజయోగ ధ్యానంలో మనలోని కుండలినీ శక్తి మేల్కొని శిరస్సు పైభాగమునకు ప్రయాణించినప్పుడు మనం ఆలోచనారహిత స్థితిని పొంది మానసిక ప్రశాంతతను పొందుతాము.ఈ ఆత్మ సాక్షాత్కారం కోసం పూర్వం ఎంతోమంది సాధుపుంగవులు మునులు చాలా కష్టపడి తపస్సు చేసి సాధించగలిగిన శక్తిని పరమ పూజ్య శ్రీ మాతాజీ నిర్మలాదేవి ఇప్పుడు అతి సులువుగా మనందరికీ కలుగజేస్తున్నారు. ఇప్పటికే సుమారు 120 దేశాల్లో లక్షలాదిమంది సహజ యోగము వలన ప్రయోజనం పొందుతున్నారు అని తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ గౌరీ కృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి సాహసయోగ కమిటీ సభ్యులు సుప్రజ వినోద్ వినయ్ మల్లారెడ్డి పాల్గొన్నారు.

# బిజినెస్

# ఇక ఉబర్ ఫ్లైట్స్

## హెచ్‌డీఎఫ్‌సీ ఖాతాదారులకు షాక్..

**రెండు రోజుల పాటు యూపీఐ సేవల నిలిపివేత**





హెచ్‌డీఎఫ్‌సీ వెబ్‌సైట్‌లో ఉంచిన ప్రకటన ప్రకారం నవంబర్ నెలలో రెండు పాటు యూపీఐ సేవలను నిలిపేస్తామని పేర్కొంది. అవసరమైన సిస్టమ్ అవసరాలను అప్‌డేట్ చేసేందుకు నవంబర్ 5న, 23న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూపీఐ సేవలు అందుబాటులో ఉండవని వివరించింది. నవంబర్ 05న అర్ధరాత్రి 12 గంట నుంచి రెండు గంటల వరకు, నవంబర్ 23న కూడా అర్ధరాత్రి 12 గంటల నుంచి మూడు గంటల వరకు కస్టమర్లకు యూపీఐ సేవలను అందుబాటులో ఉండవు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కరెంట్ %ఒ% సేవింగ్స్ ఖాతా, రూపే క్రెడిట్ కార్డ్‌పై ఫైనాన్షియల్, నాన్-ఫైనాన్షియల్ యూపీఐ లావాదేవీలు అందుబాటులో ఉండవు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ యూపీఐ హ్యాండిల్‌ని ఉపయోగించి బ్యాంక్ ఖాతాదారులందరికీ హెచ్‌డీఎఫ్‌సీ మొబైల్ బ్యాంకింగ్ యాప్, జీ పే, వాట్సాప్ పే, పేటీఎం, శ్రీరామ్ ఫైనాన్స్, మొబిక్విక్, క్రెడిట్ పేలో ఆర్థిక, ఆర్థికేతర యూపీఐ లావాదేవీల హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ కొనుగోలు చేసిన వ్యాపారులకు అన్ని యూపీఐ లావాదేవీలు అందుబాటులో ఉండవు. యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్ ఫేస్ అనేది ప్రత్యేకమైన యూపీఐ ఉపయోగించి డబ్బును చెల్లించడానికి/ స్వీకరించడానికి పాల్గొనే బ్యాంక్ కస్టమర్ల కోసం స్మార్ట్ ఫోన్ న్ ఎనేబుల్డ్ ఫండ్ బదిలీ ఆప్షన్‌గా ప్రస్తుతం అందుబాటులో ఉంది. అలాగే మీరు ఈ యూపీఐ చెల్లింపులు ట్రాన్స్‌యాక్షన్ హిస్టరీ ట్యాబ్‌లో గత లావాదేవీలను వీక్షించవచ్చు. సాధారణంగా యూపీఐ పిన్ తప్పుగా ఎంటర్ చేసినా, అకౌంట్‌లో తగినంత సొమ్ము లేకపోయినా యూపీఐ లావాదేవీలు తిరస్కరణకు గురవుతాయి. అయితే బ్యాంకులు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో లావాదేవీలను నిలిపేసిన సమయంలో కూడా యూపీఐ లావాదేవీలు తిరస్కరణకు గురవుతాయి. అందువల్ల కస్టమర్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆ సమయంలో లావాదేవీలను నిలిపేయాలని బ్యాంకులు కోరుతూ ఉంటాయి. అలాగే యాక్టివ్ బ్యాంక్ అకౌంట్‌తో పాటు ఆ అకౌంట్‌కు లింక్ చేసిన మొబైల్ నంబర్, యాక్టివ్ డెబిట్ కార్డ్ లేదా క్రెడిట్ కార్డ్ ఉన్న ఎవరైనా యూపీఐ సేవలను ఉపయోగించవచ్చు.

**-వైమానిక అధికారుల కోసం ఒప్పందం**
**-ఐఎఎఫ్, ఉబర్ అగ్రిమెంట్ పున:పరిశీలించాలని భద్రతా నిపుణుల డిమాండ్**

**న్యూఢిల్లీ**

భారత వైమానిక దళం (ఐఏఎఫ్), అమెరికాకు చెందిన యాప్ ఆధారిత క్యాబ్ సేవల సంస్థ ఉబర్ మధ్య కుదిరిన ఒప్పందంపై భద్రతా నిపుణులు ఆందోళన వ్యక్తం చేశారు. క్యాబ్ సేవల కోసం ఉబర్‌తో భారత వైమానిక దళం ఓ ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం వైమానిక దళానికి చెందిన అధికారులు, వారి కుటుంబాలకు ఉబర్ సంస్థ ఎలాంటి ఆటంకాలు లేకుండా సేవలు అందించాల్సి ఉంటుంది.




అయితే ఈ ఒప్పందంపై భద్రతా నిపుణులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సమాచారం బయటికి పొక్కే అవకాశం ఉన్నదని, అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఎక్కడ ఉన్నదీ తేలికగా కనిపెట్టవచ్చునని, వేరే యాప్‌లు కీలక సమాచారాన్ని పొంది దానిని ఇతరులకు అందజేసే ప్రమాదం ఉన్నదని వారు అనుమానాలు వెలిబుచ్చారు. ఈ నేపథ్యంలో ఉబర్‌తో కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందం (ఎంఓయూ)పై పునఃపరిశీలన జరపాలంటూ రిటైర్డ్ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ కేజీఎస్ ఢిల్లాన్ వైమానిక దళ నాయకత్వానికి సూచించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు.

## ఐపీఓ బాటలో స్విగ్గీ.. మరో వారం రోజుల్లో కొనుగోళ్లకు సిద్ధం




స్విగ్గీ ప్రారంభ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) నవంబర్ 6, 2024న సభ్యత్వం కోసం తెరుస్తారు. పబ్లిక్ ఇష్యూ నవంబర్ 8 వరకు సబ్‌స్క్రిప్షన్ కోసం తెరిచి ఉంటుంది.ఐపీఓ విలువ రూ. 11,327.43 కోట్లు, స్విగ్గీ ఐపీఓకు సంబంధించిన ఇష్యూ ధర ఒక్కో షేరుకు రూ. 371 నుంచి రూ. 390 మధ్య నిర్ణయించారురిటైల్ ఇన్వెస్టర్లు రూ. 14,820 విలువైన 38 షేర్లను కొనుగోలు చేయవచ్చు. గరిష్టంగా రూ. 192,660 విలువైన 13 లాట్‌లను కొనుగోలు చేయవచ్చు.హై నెట్ వర్త్ ఇండివిడ్యువల్ (హెచ్ఎన్ఐ) కోసం కనీస లాట్ 14, దీని విలువ రూ. 207,480గా ఉంది. హెచ్ఎన్ఐ రూ. 992,940 ఉండగా గరిష్టంగా 67 లాట్‌లను కొనుగోలు చేయవచ్చు. ఐపీఓ కోసం తాత్కాలిక కేటాయింపు తేదీ నవంబర్ 11గా ఉంది.లింక్ఇన్‌టైమ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ అనేది స్విగ్గీ ఐపీఓకు సంబంధించిన అధికారిక రిజిస్ట్రార్‌గా ఉంది. స్విగ్గీ షేర్లు నవంబర్ 13న ఎన్ఎస్ఈ, బీఎస్ఈరెండు ఎక్స్ఛేంజీలలో ప్రారంభమవుతాయి.

## 19న గ్లోబల్ మార్కెట్లలో అసుస్ రోగ్ ఫోన్ 9 ఆవిష్కరణ.. ఇవీ డిటెయిల్స్


ప్రముఖ స్మార్ట్ ఫోన్ల తయారీ సంస్థ అసుస్.. తన అసుస్ రోగ్ ఫోన్ 9 సిరీస్ ఫోన్లను ఈ నెల 19న గ్లోబల్ మార్కెట్లలో ఆవిష్కరించనున్నది. త్వరలో భారత్ మార్కెట్లలో ఈ ఫోన్ ఆవిష్కరిస్తారు. 185 హెర్ట్జ్ ఎల్టీపీఓ ఫ్లాట్ డిస్ ప్లే కలిగి ఉంటుంది. అప్ గ్రేడెడ్ అనిమీ విజన్ ఫీచర్ తోపాటు ఏఐ ఫీచర్లు కూడా ఉంటాయి. స్నాప్ డ్రాగన్ 8 ఎలైట్ చిప్ సెట్, అనిమీ విజన్ మద్దతుతో ఏఐ బ్యాక్డ్ కెమెరాలు ఉంటాయి. 16 జీబీ ర్యామ్ విత్ 512 జీబీ స్టోరేజీతో వస్తోందీ ఫోన్. 65వాట్ల వైర్డ్ చార్జింగ్ మద్దతుతో 5800 ఎంఏహెచ్ కెపాసిటీ గల బ్యాటరీతో వస్తున్న ఈ ఫోన్ ఆండ్రాయిడ్ 15 బేస్డ్ రోగ్ యూఐ వర్షన్ ఓఎస్ సిస్టమ్ తో పని చేస్తుంది.అసుస్ రోగ్ ఫోన్ 9 ఫోన్ 6.78 అంగుళాల ఫుల్ హెచ్డీం (1080ఐ2400 పిక్సెల్స్) శాంసంగ్ ఫ్లెక్సిబుల్ ఎల్టీపీఓ అమోలెడ్ స్క్రీన్, 2500 నిట్స్ పీక్ బ్రైట్ నెస్, గొరిల్లా గ్లాస్ విక్టస్ ప్రొటెక్షన్, సెక్యూరిటీ కోసం ఇన్-డిస్ ప్లే ఫింగర్ ప్రింట్ సెన్సర్ ఉంటుంది. అసుస్ రోగ్ ఫోన్ 9 ఫోన్ ట్రిపుల్ రేర్ కెమెరా సెటప్ కలిగి ఉంటుంది. ఇందులో 1/1/56 అంగుళాల 50-మెగా పిక్సెల్ సోనీ ల్వైతియా 700 ప్రైమరీ సెన్సర్ కెమెరా, 13 -మెగా పిక్సెల్ ఆల్ట్రా వైడ్ షూటర్, 5- మెగా పిక్సెల్ మాక్రో కెమెరా ఉంటాయి.

## సొంతగడ్డపై క్లీన్‌స్వీప్..

# టీమిండియా అగ్రస్థానం గోవిందా

# స్పోర్ట్స్

స్వదేశంలో వరుసగా 18వ సిరీస్ విజయానందం ఆవిరైంది. 12 ఏండ్లుగా ట్రోఫీని వదలని టీమిండియా తొలిసారి ఘోర పరాభవం మూటగట్టుకుంది. టన్నుల కొద్దీ పరుగులు.. రికార్డుల మీద రికార్డులు బద్దలు కొట్టిన యోధులంతా ఆడలేక చేతులెత్తేశారు. ఫలితంగా స్పిన్ పిచ్‌లతో ప్రత్యర్థులను దెబ్బకొట్టే భారత జట్టు ఇప్పుడు అదే అస్త్రానికి తలొంచింది. రోహిత్ శర్మ బృందం 3-0తో సిరీస్ కోల్పోవడం అభిమానులకు మింగుడుపడడం లేదు. ముంబైలో 25 పరుగుల ఓటమితో వైట్‌వాష్‌కు గురైన టీమిండియాకు మరో షాక్. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ( WTC 2023-25) పాయింట్ల పట్టికలో అగ్రస్థానం చేజారింది.బంగ్లాదేశ్‌పై 2-0తో టెస్టు సిరీస్ గెలుపొందిన టీమిండియా నెల రోజుల్లోనే తేలిపోయింది. శ్రీలంక చేతిలో చావుదెబ్బ తినొచ్చిన న్యూజిలాండ్ చేతిలో చిత్తుగా ఓడి సిరీస్ సర్పించుకుంది. 147 పరుగుల లక్ష్యాన్ని ఛేదించలేక వైట్‌వాష్‌కు గురైంది. ఈ ఓటమితో వరుసగా మూడోసారి డబ్ల్యూటీసీ ఫైనల్ చేరాలనుకున్న భారత జట్టుకు గట్టి దెబ్బ తగిలింది. డబ్ల్యూటీసీ రాంకింగ్స్‌లో టీమిండియా 58.33 పాయింట్లతో రెండో స్థానానికి పడిపోగా.. ఆస్ట్రేలియా టాప్ ర్యాంక్ సొంతం




చేసుకుంది.

శ్రీలంక 55.56 పాయింట్లతో మూడో, న్యూజిలాండ్ 54.55 పాయింట్లతో నాలుగో ర్యాంకులో కొనసాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో రోహిత్ సేన టెస్టు గద పోరుకు అర్హత సాధించాలంటే ఆస్ట్రేలియా పర్యటనలో 5-0తో బోర్డర్ గవాస్కర్ ట్రోఫీని దక్కించుకోవాలి. అయినా సరే.. ఫైనల్ చాన్స్ కోసం శ్రీలంక, కివీస్, దక్షిణాఫ్రికా ఫలితాలపై ఆధారపడాల్సి ఉంటుంది. అలాకాకుండా ఆసీస్ ఈసారి ట్రోఫీ అందుకుంటే.. టీమిండియా ఆశలు ఆవిరైనట్టే.

**ఒక్కరు నిలబడినా**

సొంతగడ్డపై 12 ఏండ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయిన టీమిండియా మళ్లీ అదే తడబాటు కనబరిచింది. బెంగళూరు, పునే, ముంబై.. వేదిక మారినా ఫలితం మారలేదు. ఇప్పటికే రెండు ఓటములతో టెస్టు సిరీస్ కోల్పోయిన భారత జట్టు ముంబైలోనూ స్పిన్ అస్త్రానికి కుప్పకూలింది. వరల్డ్ క్లాస్ బ్యాటర్లతో నిండిన భారత్ టాపార్డర్ విఫలమైనా రిషభ్ పంత్(64) విధ్వంసక హాఫ్ సెంచరీతో ఆశలు రేపినా.. అజాజ్ పటేల్(6/57) తిప్పేశాడు. లంచ్ తర్వాత కాసేపటికే పంత్‌ను వెనక్కి పంపిన అతడు.. వాషింగ్టన్ సుందర్(12)ను బౌల్డ్ చేసి కివీస్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. 25 పరుగుల తేడాతో ఓడి ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్ ఆశల్ని సంక్లిష్టం చేసుకుంది. ఒకవేళ టాపార్డర్‌లో ఒక్కరు పంత్‌కు తోడుగా నిలబడినా ముంబైలో విజయం మనదే అయ్యేది. కానీ, సంచలనాలకు నెలవైన క్రికెట్‌లో అత్యుత్తమ ఆట ఆడిన జట్టే గెలుస్తుందని న్యూజిలాండ్ మరోసారి చాటింది.

## ప్యాడ్ తగిలినా ఔట్ ఇస్తారా?.. అంపైర్లపై పంత్ ఆగ్రహం



లంచ్ అనంతరం ఎదురుదాడికి దిగిన పంత్ అజాజ్ పటేల్ ఓవర్లో వరుసగా రెండు బౌండరీలు బాదాడు. ఆ తర్వాత బంతిని డిఫెన్స్ చేయబోగా అది గాల్లోకి లేచింది. దాంతో, అది క్యాచ్ ఔట్ అని కివీస్ ఆటగాళ్లు అప్పీల్ చేశారు. రిప్లేలో స్పైక్ కనిపించడంతో టీవీ అంపైర్ పంత్‌ను ఔట్‌గా ప్రకటించాడు. ఇదే విషయమైన పంత్ ఫీల్డ్ అంపైర్లతో వాగ్వాదానికి దిగాడు. 'బంతి నా ప్యాడ్‌కు తగిలింది' అని చెబుతూ వాళ్లపై ఆగ్రహం వ్యక్తం చేశాడు. కానీ, టీవీ అంపైర్ నిర్ణయానికి కట్టుబడి జట్టును గెలిపించలేకపోయానే అనే బాధతో పెవిలియన్ బాట పట్టాడు. పంత్ వివాదాస్పదంగా ఔట్ కావడంపై మ్యాచ్ అనంతరం సారథి రోహిత్ శర్మ స్పందించాడు. 'టీవీ అంపైర్ పంత్‌ను ఔట్ అని చెప్పడంతో షాకయ్యాను. డీఆర్ఎస్ విధానం ఎవరికైనా ఒకేలా ఉండాలి. ఒకవేళ రీప్లేలో స్పష్టంగా తెలియనప్పుడు ఫీల్డ్ అంపైర్ నిర్ణయమే ఫైనల్ కావాలి' అని హిట్‌మ్యాన్ అన్నాడుక్వీన్‌స్వీప్ తప్పాలంటే వాంఖడేలో పోరాటమే శరణ్యమని తెలిసినా భారత టాపార్డర్ కుప్పకూలింది. అజాజ్ పటేల్ దెబ్బకు మేము క్రీజులో ఉండలేమంటూ శుభ్‌మన్ గిల్(1), విరాట్ కోహ్లీ(1), సర్ఫరాజ్ ఖాన్(1)లు పెవిలియన్ చేరారు. ఇక అందరి ఆశలు మోస్తూ క్రీజులోకి వచ్చిన పంత్ ఉన్నంత సేపు స్వీప్ షాట్లతో అలరించాడు. టైమింగ్ కుదరకున్నా పట్టుదలగా ఆడుతూ రవీంద్ర జడేజా(6), వాషింగ్టన్ సుందర్(12)లతో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దాంతో, పంత్ భారత్‌ను గెలిపించడం ఖాయం అనుకున్నారంతా. కానీ, లంచ్ తర్వాత కథ మారింది. అనూహ్యంగా పంత్ 64 వద్ద ఔట్ అయ్యాడు. అంతే.. ఆ తర్వాత 21 పరుగులకే టీమిండియా ఇన్నింగ్స్ ముగిసింది. వరుసగా మూడో ఓటమితో రోహిత్ సేనకు వైట్‌వాష్ తప్పలేదు. అనూహ్య మలుపులు తిరిగిన ముంబై టెస్టులో 'రిషభ్ పంత్ ఔట్ కాకపోయి ఉంటే మనం గెలిచేవాళ్లం'.. ఈ మాట మనసులో అనుకోని అభిమానులు ఉండరు. 29 పరుగులకే 4 వికెట్లు పడిన దశలో క్రీజులోకి వచ్చిన పంత్ ఓ యోధుడిలా పోరాడాడు.

# బాక్సర్లకు 17 పతకాలు

పార్థవి (65 కి.), వంశిక (80 కి.), క్రిషా (75 కి.) మహిళల విభాగంలో మెరవగా పురుషుల విభాగంలో హేమంత్ సంగ్వాన్ (90 కి.) పసిడి పంచ్ విసిరాడు. మరో 8 మంది బాక్సర్లు (నిషా, సుప్రియా, క్రితిక, చంచల్, అంజలి, విని, ఆకాంక్ష, రాహుల్) రజతాలు సాధించారు. రిషి సింగ్, క్రిష్, సుమిత్, లక్ష్య, ఆర్యన్ కాంస్యాలు నెగ్గారు. అమెరికా వేదికగా జరిగిన మొదటి అండర్-19 వరల్డ్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత యువ బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నీలో భారత్ ఏకంగా 17 పతకాలు సాధించింది.





# పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' స్క్రిప్ట్‌లో మార్పులు.?

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రాలలో ఒకటి 'ఉస్తాద్ భగత్ సింగ్' . ఈ సినిమాకు గబ్బర్ సింగ్ ఫేమ్ హరీశ్ శంకర్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. 2022లోనే మొదలైన ఈ చిత్రం ఆంధ్రప్రదేశ్ ఎన్నికల వలన వాయిదా పడింది. అయితే ఈ సినిమా షూటింగ్ ఎప్పుడు మొదలవుతుందా అని ఫ్యాన్స్‌తో పాటు సినీ ప్రేక్షకులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఈ మూవీ సంబంధించి ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. ఈ సినిమా స్క్రిప్ట్‌కి సంబంధించి మార్పులు చేస్తున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించి మార్పులు చేయమని హరీశ్‌ను పవన్ కోరగా.. హరీశ్ ఒకే చెప్పినట్లు తెలుస్తుంది. కొన్ని రోజుల క్రితం హరీశ్ శంకర్ పవన్‌ను కలువగా.. ఈ మార్పులు గురించి చర్చ వచ్చినట్లు తెలుస్తుంది. అలాగే ఈ సినిమాలో డైలాగ్స్‌కు సంబంధించి కూడా వాటి వెర్షన్?ను మార్చమని పవన్ కోరారని, అందుకు తగ్గట్లు హరీశ్ స్క్రిప్ట్ రీవర్క్ చేస్తున్నారని సమాచారం. కాగా ఈ మూవీ షూటింగ్ త్వరలోనే హైదరాబాద్‌లో ప్రారంభంకాబోతున్నట్లు తెలుస్తుంది.




# తప్పు సరిదిద్దుకునే పనిలో పూజా హెగ్డే.!

ఆ మధ్య సౌత్ నార్త్ ఇండస్ట్రీల్లో సూపర్ ఫామ్‌లో కనిపించిన పూజా హెగ్డే సడన్‌గా స్లో అయ్యారు. వరుస ఫెయిల్యూర్స్‌తో అమ్మడి కెరీర్ గాడి తప్పింది. దీంతో అవకాశాలు కూడా చేజారాయి. ఇప్పుడిప్పుడే మళ్లీ ఫామ్‌లోకి వస్తున్న ఈ బ్యూటీ, మళ్లీ కెరీర్ మీద ఫోకస్ చేస్తున్నారు. కొత్త ఏడాదికి కొత్త ప్లాన్‌తో సిద్ధమవుతున్నారు. రాధేశ్యామ్ రిలీజ్‌కు ముందు కెరీర్‌లో మంచి ఫామ్‌లో ఉన్నారు పూజా హెగ్డే. కానీ ఆ సినిమా ఫెయిల్యూర్ అరవింద ఆశలు ఆవిరి చేసేసింది. రాధేశ్యామ్ సూపర్ హిట్ అయితే పాన్ ఇండియా హీరోయిన్‌గా బిజీ అవ్వొచ్చని భావించిన బుట్టబొమ్మకు షాక్ తగిలింది.ఆ తరువాత నార్త్ సినిమాలు కూడా ఫెయిల్ అవ్వటంతో పూజా కెరీర్ పూర్తిగా గాడి తప్పింది. కొంత కాలం సౌత్, నార్త్ ఇండస్ట్రీలో పూజ పేరే వినిపంచలేదు. ఈ పరిస్థితుల్లో తమిళ సినిమా బుట్టబొమ్మకు మళ్లీ ఛాన్స్ ఇచ్చింది. ప్రజెంట్ సూర్య 44, దళపతి 69 సినిమాల్లో నటిస్తున్నారు పూజా హెగ్డే. తాజాగా వరుణ్ ధావన్ హీరోగా తెరకెక్కుతున్న ఓ హిందీ సినిమాకు కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. తిరిగి ఆఫర్స్ వస్తుండటంతో కెరీర్ మీద ఫోకస్ పెంచిన పూజా హెగ్డే కొత్త స్ట్రాటజీ సిద్ధం చేస్తున్నారు. గతంలో తాను చేసిన తప్పులను ఎనలైజ్ చేసుకొని..,ఇక మీదట చేయబోయే సినిమాల విషయంలో ఆ తప్పులు జరగకుండా చూసుకుంటానని చెబుతున్నారు. నెక్ట్స్ ఇయర్ తన కెరీర్‌లో కొత్త టర్న్ రాబోతుందంటున్నారు బుట్టబొమ్మ.



# ఇకపై అలాంటి సాంగ్స్ చేయను..

పాన్ ఇండియా లెవల్లో అత్యధిక ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న హీరోయిన్లలో సమంత ఒకరు. ఎన్నో హిట్ చిత్రాలతో సౌత్ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్న సామ్.. ఇప్పుడు బాలీవుడ్ చిత్రాల్లో నటిస్తుంది. చివరిసారిగా ఖుషి చిత్రంలో కనిపించిన సామ్.. కొన్ని నెలలుగా మయోసైటిస్ సమస్యకు చికిత్స తీసుకుంటూ విశ్రాంతి తీసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడిప్పుడే మీడియ ముందుకు వస్తుంది ఈ ముద్దుగుమ్మ. చాలా రోజులుగా సినిమాలకు దూరంగా ఉంటుంది సామ్. కానీ అంతకు ముందు ఆమె నటించిన సిటాడెల్ వెబ్ సిరీస్ ఇటీవలే పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి చేసుకుంది. ఈ సిరీస్ త్వరలోనే అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. నవంబర్ 7 నుంచి ఈ సిరీస్ అందుబాటులోకి రానుంది. రాజ్ అండ్ డీకే దర్శకత్వం వహించిన ఈ సిరీస్ లో బీటౌన్ హీరో వరుణ్ ధావన్ ప్రధాన పాత్ర పోషించారు. ఈ సిరీస్ ప్రమోషన్లలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న సామ్ ఆసక్తికర కామెంట్స్ చేసింది.గతంలో ఓ మీడియకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సామ్ మాట్లాడుతూ ఆసక్తి విషయాలను పంచుకుంది. ఇక పై మీరు స్పెషల్ సాంగ్స్ చేస్తారా ? అని అడగ్గా.. చెయ్యనని చెప్పింది. అల మీరు సింగిల్ గా ఉండాలని అనుకుంటున్నారా అంటే లేదు అంటూ ఆన్సర్ ఇచ్చింది. అంటే ఇకపై సా స్పెషల్ సాంగ్స్ చేయనని.. అలాగే సింగిల్ కాకుండా మింగిల్ అవ్వడానికి రెడీగా ఉన్నానంట చెప్పిందంటూ ఈ వీడియోను తెగ షేర్ చేస్తున్నారు ఫ్యాన్స్.ఇదిలా ఉంటే.. అల్లు అర్జున్ నటించిన పు చిత్రంలో సామ్ స్పెషల్ సాంగ్ చేసిన సంగతి తెలిసిందే. ఊ అంటావా మావ ఊహు అంటావ సాంగ్ రేంజ్ లో హిట్టయ్యిందో చెప్పక్కర్లేదు. ఇక ఇప్పుడు పుష్ప 2లోనూ స్పెషల్ సాంగ్ ఉంటుందని.. అందులో సమంతతోపాటు మరో హీరోయిన్ శ్రీలీల కూడా కనిపించనుందంటూ టాక్ వినిపిస్తుంది. కానీ దీనిపై ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన రాలేదు.

# చిలకపచ్చ చీరలో తెలుగింటి అందం.. కట్టిపడేస్తోన్న ఈషా రెబ్బ..

టాలీవుడ్ ఇండస్ట్రీలో గుర్తింపు తెచ్చుకున్న అతి తక్కువమంది తెలుగమ్మాయిలలో ఈషా రెబ్బ ఒకరు. తెలుగు ప్రేక్షకులకు ఈ అమ్మడు గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అద్భుతమైన నటనతో సినీ ప్రియులను మెప్పించింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో వరుస సినిమాల్లో నటించి మెప్పించింది. చిన్న చిన్న సినిమాల్లో నటిస్తూ మంచి గుర్తింపు తెచ్చుకున్న ఈ వయ్యారికి ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం రాలేదు. అలాగే పెద్ద స్టార్ హీరోల సినిమాల్లో సెకండ్ హీరోయిన్ గా కనిపించింది.అంతకు ముందు ఆ తర్వాత సినిమాతో కథానాయికగా తెలుగు తెరకు పరిచయమైన ఈ అమ్మడు.. అమీ తుమీ, విస్మయం, బ్రాండ్ బాబు వంటి చిత్రాల్లో నటించింది. ఎన్టీఆర్ నటించిన అరవింద సమేత వీర రాఘవ మూవీలోనూ మెరిసింది. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్ కాగా.. సెకండ్ హీరోయిన్ గా కనిపించింది ఈషా. ఆ తర్వాత పలు చిత్రాల్లో కనిపించిన ఈ అమ్మడు.. ఓటీటీ ప్లాట్ ఫామ్స్ పై సందడి చేసింది. వెబ్ సిరీస్ చేస్తూ సినీ ప్రియులను అలరించింది.తాజాగా చిలకపచ్చ చీరలో అందంగా ముస్తాబయ్యింది ఈషా. ఇందుకు సంబంధించిన ఫోటోస్ ఇన్ స్టాలో షేర్ చేయగా.. నెటిజన్లు ఫిదా అవుతున్నారు. ఈషాను చూసి అందమే అసూయ పడుతుందంటూ కామెంట్స్ చేస్తున్నారు.



Printed published and woned by Tarigolpula Lakshmi, mahender ,printers karshak Art Printers, Hyderabad and published by office 2-6-376, Jaipuri colony,Nogole village,Uppal mandal, district Ranga Reddy,Post GSI,500068-Telangana RNI NO.APTEL/2012/46853 . Email ID : Prajaswecha@gmail.com, website, www.Prajaswecha.com cell 9381910611, 79892 89492